బస్ షెల్టర్ ప్రాంతం పరిశీలన

విశాలాంధ్ర-తాడేపల్లి : మణిపాల్ ఆసుపత్రి తదితర ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్ళ వద్ద ఏర్పాటు చేయనున్న బస్ షెల్టర్ ప్రాంతాలను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), నగర పాలక సంస్థ కమిషనర్ యు.శారదా దేవి, డీఈ కృష్ణారెడ్డి, ఏసీబీ వెంకటేశ్వర్లు, ఏఈ కిషోర్ రెడ్డి, నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ రాంబాబు, సీఐ శేషగిరిరావు మంగళవారం పరిశీలించారు. సీఎం క్యాంప్ కార్యాలయం మార్గం వెంబడి ఆక్రమణలకు గురైన డ్రైనేజీ కాలువలను స్థానిక ఎమ్మెల్యే ఆర్కే పరిశీలించారు. డ్రైన్ టూ డ్రైన్ బీటి రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం మంగళగిరి ఏపీపీఎస్పీ బెటా లియన్, ఆటోనగర్, చినకాకాని ఎన్నారై జంక్షన్ సమీపంలో ఏర్పాటు చేయనున్న బస్ షెల్టర్ల ప్రధాన కూడళ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బుర్రముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి, డేవిడ్ రాజు, మున్నంగి వివేకానందరెడ్డి, సంపూర్ణ పార్వతి పాల్గొన్నారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు : ఉపాధ్యాయులు విద్యార్థుల సమగ్రాభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని కాకుమాను మండల విద్యాశాఖ అధికారి కేఎస్ కెనడి అన్నారు. పాఠశాలల వార్షిక తనిఖీలో భాగంగా కాకుమాను మండల విద్యాశాఖాధికారి కేఎఫ్ కెనడీ మంగళవారం రేటూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఉదయం పాఠశాల అసెంబ్లీ నిర్వహణలో పాల్గొని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలో నిర్వహించే వివిధ రకాల రిజిష్టర్లు, రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు. పాఠశాల మెరుగైన నిర్వహణకు తగు సూచనలు ఇచ్చారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తరగతుల, విషయ, సామర్థ్యాల వారీగా విద్యార్థుల ప్రగతిని సీఆర్పీలు పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు. సమీక్ష అనంతరం మెరుగైన బోధనకు ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. ఈ వార్షిక తనిఖీలో పాఠశాల హెచ్ఎం రసూల్, ఉపాధ్యాయులు సద్గుణరావు, పూర్ణచంద్రరావు, శివశంకరరావు, సీఆర్పీలు సురేంద్ర, జమాయమ్మ, చలపతిరావు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్ వర్సిటీ అధ్యాపకుడికి పీహెచ్‌డీ

విశాలాంధ్ర-గుంటూరు : విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఈసీఈ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ మహమ్మద్ తాజ్‌కు తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అంద జేసిందని విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మంగళ వారం తెలియజేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'డిజైన్, సిములే షన్ అండ్ ఫ్యాబ్రికేషన్ ఆఫ్ హై సెన్సిటివిటీ మల్టీడైరెక్షనల్ ఇనెర్షియల్ సెన్సార్' అనే అంశంపై పరిశోధన చేశారని తెలియజేశారు. ఈయనకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఈసీఈ విభాగం అధిపతి ప్రొఫెసర్ టి.పిచ్చయ్య గైడ్‌గాను, డాక్టర్ ఎన్‌వీఆర్ విక్రమ్ కో-గైడ్‌గాను వ్యవహ రించారు. తన పరిశోధనలో భాగంగా మొత్తం 2 ఎస్‌సీఐ, 5 కాన్ఫరెన్స్ పేపర్లు పబ్లిష్ చేశారని వెల్లడించారు. పీహెచ్‌డీ పట్టాపొం దిన అసిస్టెంట్ ప్రొఫెసర్ మహమ్మద్ తాజ్‌ను ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

తహశీల్దార్ నాగిరెడ్డి బాధ్యతలు

విశాలాంధ్ర-తాడేపల్లి : మండల నూతన తహశీల్దార్‌గా నాగిరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ నాగిరెడ్డి మాట్లాడుతూ తాడేపల్లిలోని ప్రజలకు సేవలు అందించేందుకు ముందుంటానన్నారు. ప్రజల సమస్యలు అవసరాలు అనుగుణంగా పనిచేస్తానన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన వాకా శ్రీనివాసులరెడ్డి, ఇంచార్జ్ తహశీల్దార్ రాంప్రసాద్ బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మాతృభాష పరిరక్షణకు నడుంబిగించాలి

విశాలాంధ్ర-పెదనందిపాడు : మన ఉనికి, సంస్కృతి సంప్రదాయాలకు, జీవన విధానానికి మాతృభాష మూలాధారమని, మన మాతృభాష తెలుగును పరిరక్షించుటకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరూ నడుం బిగించాలని ఘంటసాల చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని గ్రంథాలయ నిర్వహకురాలు పి.సుభాషిని ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహిం చారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు మాట్లాడుతూ బావ అవగాహనకు, భావవ్యక్తికరణానికి మాతృభాష ద్వారానే సులభంగా దోహదపడుతుం దన్నారు. మాతృభాష ద్వారా అనేక భాషలను సులభంగా నేర్చుకోవచ్చునని ప్రజలందరూ మాతృభాష పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంజుల, ఉపాధ్యాయులు ఎన్.రామకృష్ణ, జూపూడి కోటేశ్వరరావు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల అభినందన సభ

విశాలాంధ్ర-తెనాలి : తెనాలి, కొత్తపేటలోని శ్రీరామకృష్ణ కవి కళాక్షేత్రం హాలులో అభినందన సభ మంగళవారం జరిగింది. నాయిబ్రాహ్మణులకు దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ చేయని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయశాఖ పరిధిలోని 610 ఆలయాల ట్రస్ట్ బోర్డు నియామకాలలో నాయిబ్రాహ్మణ సామాజిక వర్గం నుండి ఒకరికి తప్పనిసరిగా స్థానం కల్పిస్తూ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఆర్డినెన్స్ జారీ చేసారు. దశాబ్దాల కాలం నుండి నాయిబ్రాహ్మణులు పోరాడుతున్న సమస్యలను అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే పరిష్కరించినందుకు కృతజ్ఞ తలు తెలుపుతూ తెనాలి నియోజవర్గం పరిధిలోని నాయిబ్రాహ్మణ సోదరులు నిర్వహించిన అభినందన సభ కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నాయిబ్రాహ్మణులకు జగన్ మాత్రమే తగిన న్యాయం చేశారని, ప్రభుత్వం మరెన్నో పథకాలు ప్రవేశపెట్టి ఇంకా సేవలందిస్తుందని వారికి భరోసా ఇచ్చారు.

శాంతి కమిటీ ఏర్పాటు చేస్తాం

విశాలాంధ్ర-తాడికొండ : బడేపురం గ్రామంలో గత కొంతకాలంగా హిందువులు దళితుల మధ్య వివాదం కొనసాగుతుంది. గ్రామ శివారులోని కొండపై హిందువులు శివాలయాన్ని నిర్మించారు. అలాగే పక్కనే ఉన్న మరో కొండపై దళితులు క్రైస్తవ సిలువను ఏర్పాటు చేశారు. అయితే రహదారి నిర్మించుకునే విషయమై ఇరువర్గాల మధ్య గత కొంతకాలంగా వివాదం నడుస్తుంది. తమకు న్యాయం చేయాలంటూ దళితులు సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం అడిషనల్ ఎస్పీ అనిల్ మైనింగ్ ఏడి రంగా కుమార్, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదన్ రావు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇరువర్గాల వాదనలను విన్నారు. గ్రామంలో అన్ని వర్గాలతో కలిపి శాంతి కమిటీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని గ్రామంలో అన్ని వర్గాల ప్రజలు శాంతియుతంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే అనుమతులు: కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు : జిల్లాలో ప్రైవేటు అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల అనుమతులకు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం సంబంధిత శాఖలు సక్రమంగా తనిఖీలు నిర్వహించి నివేదికలు అందించేలా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ప్రైవేట్ అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల గుర్తింపు మంజూరు రికమండేషన్స్ సమన్వయ కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇప్పటికే 112 ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యలు అనుమతుల రెన్యూవల్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని, ఇంటర్ విద్యాశాఖ అధికారులు సమన్వయంతో సంబంధిత శాఖల అధికారులు బృందంగా ఏర్పడి ప్రత్యేక డ్రైవ్ ద్వారా తనిఖీలు నిర్వహించాలన్నారు. వాస్తవ పరిస్థితులపై ఖచ్చితమైన నివేదిక అందించాలని అన్నారు. ప్రైవేటు అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు యాజమాన్యాలు కల్పించాల్సిన వసతులపై విద్యాశాఖ 2022 డిసెంబరు 21వ తేదీన 192 జీఓను జారీ చేసిందని, అగ్నిమాపక శాఖ ఫైర్ సేఫ్టీ సర్టిఫికేట్, భవనం ప్లానింగ్, శానిటేషన్‌కు సంబంధించి పట్టణ ప్రాంతాల్లో మున్సిపాల్టీలు, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయితీ అధికారులు, ట్రాఫిక్‌కు సంబంధించి పోలీస్ శాఖ, భవనం సామర్థ్యంపై ఆర్ అండ్ బీ శాఖ ఎన్ఓసీలు, సర్టిఫికేట్లు అందించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీఓలోని నిబంధనలు ఖచ్చితంగా పాటించిన వారికే అనుమతులు, రెన్యూవల్‌కు రికమండ్ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖర రావు, ఇంటర్మీడియట్ ఆర్ఐఓ సునీత, సిరిపురం ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాల ప్రిన్సిపల్ జీబీ మోహన రావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనరు వెంకటకృష్ణయ్య, ఆర్ఐ అడ్మిన్ రాఘవయ్య పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర-గుంటూరు : దేవాదాయ శాఖ ఉద్యోగుల పదోన్నతులు, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసరావు అన్నారు. ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాస రావు, ప్రధాన కార్యదర్శి కేవీ శివారెడ్డిలను గుంటూరు ఎన్జీఓ హోంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్య నిర్వాహక అధికారుల సంఘం తరుపున మంగళవారం ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవాదాయ శాఖ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.నరసింహ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ శాఖల ఉద్యోగుల కంటే దేవాదాయ శాఖ ఉద్యోగుల విధి నిర్వహణ కత్తి మీద స్వాము లాంటిదని అన్నారు. ముఖ్యంగా పండుగలు, పర్వదినాలలో ఉద్యోగ రీత్యా గురుతర బాధ్యత నిర్వహించవలసి ఉంటుందని తెలిపారు. ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ గురించి ఉద్యోగులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రధాన కార్యదర్శి కేవీ శివారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన డీఏలు, సరెండర్ లీవులు, జీపీఎఫ్‌లు తక్షణం విడుదల చేయాలని, అలా కానిపక్షంలో ఏపీజేఏసీ కార్యాచరణ మేరకు ఉద్యమ బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వ సలహాదారు ఎన్.చంద్రశేఖర్ రెడ్డి, ఏపీఎన్జీఓ జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాస రావు, కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్, దేవాదాయ శాఖ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ గార బాబు, జిల్లా అధ్యక్షులు వైవీ కృష్ణారెడ్డి, కార్యదర్శి బి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రేపు టీడీపీ జోన్-3 సమావేశం

విశాలాంధ్ర-తెనాలి : ఈ నెల 23న టీడీపీ జోన్-3(విజయవాడ, మచిలీపట్నం, గుంటూరు, నరసరావుపేట, బాపట్ల పార్లమెంట్-మొత్తం 35 నియోజకవర్గాలు) సమావేశం మంగళగిరి హైవే పక్కన గల సీకే కన్వెన్షన్‌లో నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో వేమూరు నియోజకవర్గ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఉదయం 10నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే సమావేశానికి టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు హాజరౌతారని చెప్పారు. వేమూరు నియోజకవర్గం వర్గం నుంచి పార్టీ మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు సమావేశానికి హాజరుకావాలని కోరారు. రాబోయే ఎన్నికలకు ఎలా సమాయత్తం కావాలనే అంశంపై చంద్రబాబు ఈ సమావేశంలో దిశానిర్దేశం చేస్తారని వివరించారు.

ఎడ్‌సెట్ అడ్మిషన్‌కు రేపటి వరకు అవకాశం

విశాలాంధ్ర-గుంటూరు : ఎడ్‌సెట్ 2022 అడ్మిషన్‌కు ఈ నెల 23వ తేది వరకు కళాశాలలను ఎంపిక చేసుకోవడానికి అవకాశం ఉందని ఏఎల్ కళాశాల ప్రిన్సిపాల్, డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఏఎన్‌యూ డాక్టర్ మాదాసు ఎస్తేరు సునీల ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కౌన్సిలింగ్‌లో ఏఎల్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ గుంటూరు(ఎయిడెడ్) కాలేజీకి సంబంధించిన కాలేజ్ కోడ్ 'ఆరాజ+'గా ఉంటుందని, ఎడ్‌సెట్‌లో అర్హత పొంది తమ కళాశాలలో చేరదలచుకున్న వారు 'ఆరాజ+'ను ఎంచుకోవాలని కోరారు. గతంలో ఇతర కళాశాలలను ఎంపిక చేసుకున్న వారు ఈ నెల 24న మరలా ఎంపిక చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు.

ఫ్యాక్షన్ సంస్కృతిని పెంచి పోషిస్తున్న జగన్

విశాలాంధ్ర-గుంటూరు : చంద్రబాబు రాష్ట్రంలో ఫ్యాక్షనిజాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటే, జగన్ రెడ్డి మాత్రం ఫ్యాక్షన్ సంస్కృతిని పెంచి పోషిస్తున్నాడని టీడీపీ గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ ఒక ప్రకటనలో విమర్శించారు. పులివెందుల అరాచకాన్ని, సంస్కృతిని, దౌర్జన్యాలను జగన్ రెడ్డి రాష్ట్రంలో చూపిస్తున్నారన్నారు. వైసీపీ గూండాలకు పోలీసులు పూర్తి స్వేచ్ఛ ఇచ్చినట్లు ఉందని, వైసీపీ శ్రేణులు దాడులు చేస్తుంటే పోలీసులు మౌనంగా చూస్తున్నారని ఆరోపించారు. గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై వైసీపీ రౌడీలు దాడి చేసి ధ్వంసం చేశారని, పట్టాభిని పోలీసులు అరెస్ట్ చేశారా?... లేక ఎవరైనా కిడ్నాప్ చేశారా?... అన్నది కూడా చెప్పకుండా ఒక భయానక వాతావరణాన్ని సృష్టించారని అన్నారు. స్థానిక టీడీపీ నేతలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు స్పందించి ఉంటే ఇంత ఘోరం జరిగేది కాదన్నారు. చంద్రబాబు ప్రజల్లోకి వెళితే హేరతులు పడుతున్నారని, ఆయనకు వస్తున్న జనాదరణ చూసి సైకో జగన్ ఫ్రస్టేట్ అయిపోతూ... చంద్రబాబు టూర్‌లకు అనేక ఆటంకాలు కలిగిస్తున్నారని అన్నారు.

'దేశభక్తులు, త్యాగమూర్తులను విస్మరించరాదు'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : దేశభక్తులు, త్యాగమూర్తులను విస్మరించడం మంచిది కాదని రాష్ట్రీయ బ్రాహ్మణ ఐక్యత సంక్షేమ సంఘం అధ్యక్షులు బందా శశిధర్ అన్నారు. మంగళవారం ప్రకాశం చౌక్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ శాసన మండలి సభ్యులుగా వైసీపీ అధిష్టానం చంద్రగిరి ఏసురత్నంను ప్రకటించిన తరువాత గుంటూరుకు వచ్చిన ఆయన నగరంలో అనేక మంది మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే మార్గంలో వెళ్లిన చంద్రగిరి ఏసురత్నం బ్రాడిపేట, అరండల్‌పేట ప్రకాశం చౌక్‌లోని టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాన్ని విస్మరించారంటే బహుశా ప్రకాశం పంతులు దేశానికి చేసిన సేవా, త్యాగాలను గుర్తుకు రాకో..లేక బ్రాహ్మణ కులానికి చెందిన వారు కాబట్టే ఏమో తెలియదు గానీ నివాళులు అర్పించడంలో నిర్లక్ష్యం వ్యవహరించారని అసంతృప్తి వ్యక్తంచేశారు. ఏదేమైనాప్రకాశం పంతులుకు అవమానమే జరిగిందని బ్రాహ్మణ జాతి భావిస్తోందని శశిధర్ ఆవేదన వ్యక్తంచేశారు.

మాతృభాష తెలుగును కాపాడుకుందాం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మాతృభాష తెలుగును కాపాడుకుందామని, మృతభాషగా మారకుండా కృషి చేద్దామని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ పిలుపునిచ్చారు. జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో గుంటూరులోని కన్న విద్యాసంస్థల హాలులో జరిగిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సభకు జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పాపినేని శివశంకర్ మాట్లాడుతూ ప్రాథమిక విద్య మాతృభాషలో జరగాలని కోరారు. తెలుగు భాష గొప్పతనాన్ని గురించి, మన కవుల విశిష్టతను గూర్చి వివరించారు. లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో 7150 భాషలు కొన సాగుతున్నాయని, 10 వేల మంది ప్రజలకు మించి మాట్లాడే భాషలు 121 ఉన్నాయన్నారు. బంగ్లాదేశ్ ప్రజలు బెంగాలీ భాష కోసం చేసిన పోరాట ఫలితంగా ఫిబ్రవరి 21 అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా ప్రపంచ వ్యాప్తంగా అమలౌతుందన్నారు. జర్మనీ, జపాన్, చైనా, ఫ్రాన్స్‌లాంటి అభివృద్ధి చెందిన దేశాలన్నీ మాతృ భాషలోనే విద్యను కొనసాగిస్తున్నాయన్నారు. అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కార్పోరేట్ విద్యాసంస్థలలో సంస్కృత భాష ప్రవేశపెట్టడం వలన విద్యార్థులు తెలుగు భాషను నేర్చుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 23 భాషల్లో ప్రపంచ ప్రజలలో సగం మంది మాట్లాడుతూ మాతృభాషను గౌరవిస్తున్నారన్నారు. కన్న విద్యాసంస్థల వ్యవస్థాపకులు కన్న మాస్టర్ మాట్లాడుతూ మాతృభాషను మరువరాదని, వేమన, సుమతీ శతకాలను చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత, గాయకులు డాక్టర్ చిట్టినేని లక్ష్మీనారాయణ మధుర గీతాలను ఆలపించారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర-తెనాలి : బీసీలకు ఒక గొప్పస్థానాన్ని తెచ్చిన నాయ కులు మన లోకల్ శివన్న, సీఎం జగన్మోహనరెడ్డి మాత్రమేనని వడ్డెర కమ్యూనిటి తెనాలి నియో జకవర్గ బిసి వెల్ఫేర్ మెంబర్‌గా డి.ఆదిలక్ష్మికి ప్రాధాన్యత ఇచ్చి అలాగే ఎం.ఎల్.సి. 18 స్థానాలలో 11 బిసిలకు, 1 ఎస్.టి.లకు, గుంటూరు జిల్లాలో 1వడ్డెరులకు స్థానాలు కల్పించిన ఘనత మన జగనన్నదే అని ఆయన చిత్రపటానికి బీసీ టౌన్ అధ్యక్షులు వాసు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఖలేదా నసీమ్, చెన్నుబోయిన శ్రీను, దొడ్డక సాంబశివరావు, రాష్ట్ర బట్టరాజు కార్పొరేషన్ డైరెక్టర్ సుష్మా కిషోర్ రాజు, కదారి క్రాంతి, రజిని, శ్రీను, రాము, విజయలక్ష్మి, లక్ష్మి, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర డైరీ ఆవిష్కరణ

విశాలాంధ్ర-గుంటూరు : ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర డైరిని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ మంగళ వారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు పుల్లగూర భక్తవత్సలారావు, గుంటూరు జిల్లా అధ్యక్షులు ఎస్ఎస్ మీరా, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షులు ఏచూరి శివ, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు సునీల్ సందీప్, విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నిమ్మరాజు చలపతిరావు, ఐజేయూ సభ్యులు ఓ.మార్కండేయులు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ కె.రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ రాజా సాహెబ్, ఎస్.నాగరాజు, శ్రీనివాసరావు, సభ్యులు బి.పరశ్యామ్, పి.శ్రీనివాసరావు, కె.వెంకయ్య, సుజిబాబు, మురళి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రామరాజు శ్రీనివాసరావుకు పురస్కారం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం విజయవాడలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో గుంటూరుకు చెందిన ప్రముఖ ఆడిటర్ రామరాజు ఫౌండేషన్ చైర్మన్ రామరాజు శ్రీనివాసరావుకు 'మాతృ భాషా సేవా శిరోమణి' పురస్కారం లభించింది. అధికార భాషా సంఘం అధ్యక్షులు విజయబాబు అధ్యక్షతన విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. స్వతహగా భాషాభిమాని అయిన శ్రీని వాస్ తమ సంస్థ ద్వారా అనేక సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహి స్తుంటారు. ఇప్పటికే అనేక మంది రచయతలు, కవులు, కళాకారులను సత్కరిం చారు. శ్రీనివాసరావుకు ఈ పురస్కారం లభించడం పట్ల సాహితీ వేత్తలు భూసు రపల్లి వెంకటేశ్వర్లు, సోమేపల్లి వెంకట సుబ్బయ్య, కవులు సయ్యద్ జానీబాషా, బండికల్లు జమదగ్ని, ఆడిటర్లు దామచర్ల శ్రీనివాసరావు, వామన మూర్తి, సుబ్బారావు తదితరులు ఆయనకు అభినందనలు తెలిపి హర్షం ప్రకటించారు.

2న మహాధర్నా జయప్రదం చేయండి: మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు : జగనన్న కాలనీ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, టిడ్కో లబ్దిదారులకు గృహాలు స్వాధీన పరచాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో విజయవాడలో మార్చి 2వ తేదిన తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి పిలుపునిచ్చారు. స్థానిక 52వ డివిజన్ పిచుకలగుంట శాఖ సమావేశం మల్లెబోయిన దుర్గా అధ్యక్షతన మంగళ వారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కోట మాల్యాద్రి మాట్లాడుతూ జగనన్న కాలనీ ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఏమాత్రం సరిపోవని, రూ.5 లక్షలు మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఇసుక, సిమెంట్, ఇనుము ఉచితంగా ఇవ్వాలన్నారు. అరకొరక పనులతో నిలిచిపోయిన టిడ్కో గృహాలను తక్షణమే పూర్తి చేసి లబ్ధిదారులకు స్వాధీనపరచాలని డిమాండ్ చేశారు. ఆయా డిమాండ్ల సాధన కోసం సీపీఐ చేపట్టిన మహాధర్నాలో జగనన్న కాలనీ, టిడ్కో గృహాల లబ్ధిదారులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కమిటీ సభ్యులు చల్లా మరియదాసు, సుబ్బారావు, దర్గా ఈశ్వర్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్య భాషల కన్నా మాతృభాష మధురం

విశాలాంధ్ర-పొన్నూరు : అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవ వేడుకల్లో భాగంగా స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మంగళవారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. విద్యార్థులు తెలుగు తల్లి, శ్రీకృష్ణదేవరాయలు, అన్నమయ్య తదితర తెలుగు కవుల వేషధారణతో అలరించారు. ఈ సందర్భంగా ఈ చాంప్స్ జడ్‌సీఓ బేబీ రాణి మాట్లాడుతూ కన్నతల్లిని మాతృభాషను మరువరాదన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ జి.శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ మాతృభాష మాధుర్యాన్ని ఆస్వాదించాలని, తెలుగు భాషా కౌసల్యాలను ప్రతి విద్యార్థి నేర్చుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా వక్తృత్వం, వ్యాసరచన, దస్తూరి, పుస్తక పఠనం, పాటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాష ఉపాధ్యాయులు మండే సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఇంటర్ కనెక్షన్ పనుల వలన గోరంట్ల, నగరాలు ప్రాంతాలకు ఈ నెల 22 నుండి 28 వరకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనివలన గోరంట్ల, నగరాలులోని పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కల్గుతుందని, తాగునీటి సరఫరా కోసం ప్రత్యేకంగా వాటర్ ట్యాంకర్లను ఏర్పాటు చేశామన్నారు. ట్యాంకర్లు కావల్సిన వారు 98499 08397 కాల్ చేయవచ్చని తెలిపారు. ఇంటర్ కనెక్షన్ పనుల వలన నెహ్రూ నగ ర్ నుండి సంజీ వయ్య నగర్‌కు వెళ్లే వాహనాలు మూ డు వంతెనల మీదుగా, రెడ్డిపాలెం నుండి వచ్చే వాహనాలు శారదా కాలనీ మెయిన్ రోడ్ మీదుగా వెళ్ళేలా ట్రాఫిక్ కూడా మళ్లించడమైనదని తెలిపారు.

పాస్‌పోర్ట్ పోయినది

గుంటూరు జిల్లా, పొన్నూరు టౌన్, ఎస్టీ కాలనీ, ఇందిరానగర్ 1వ లైను, ఇటికంపాడు రోడ్డు, నిమ్రా మసీదు దగ్గర, డోరు నెం.20-3-3రు కాపురస్తులు షేక్ ఖాదర్ మొహిద్దిన్ గారి కుమారుడు షేక్ రియాజ్ (సెల్ : 9700020709) నా యొక్క పాస్‌పోర్ట్ నెం. W7713723 ఒరిజినల్‌ను ది.17-02-2023న లక్ష్మీపురం నుండి పట్టాభిపురం ఏరియాకు బైకుపై ప్రయాణిస్తుండగా మార్గమధ్యలో పోగొట్టుకున్నాను. ఎవరికైనా సదరు పాస్‌పోర్ట్ దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

బహిరంగ ప్రకటన

మా క్లయింటు గుంటూరు (జిల్లా, సిటీ & రూరల్ మం.), గోరంట్ల గ్రామం, ఇంటి నెం: 6-129 కాపురస్తురాలు తురకా నాగరాజు గారి భార్య బొల్లాపల్లి @ తురకా సోమమ్మ గారి నుంచి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

మా క్లయింటు తురకా సోమమ్మ గారి తల్లి దండ్రులు బొల్లాపల్లి హైమావతి, శివయ్య గార్లు మా క్లయింటు చిన్నతనంలోనే చనిపోవడంతో తండ్రి లేటు బొల్లాపల్లి శివయ్యకు చెందిన తాడికొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని సర్వే నెం: 432 లోని య.0-83 శెంట్ల వ్యవసాయ మెట్ట భూమికి సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలు, మరియు దస్తా వేజులను ఆమె సంరక్షకులుగా ఉన్న తన పెద నాన్న గారైన బొల్లాపల్లి సాంబయ్య, వరుసకు మేనమామ అయిన బత్తుల సాంబయ్యల వద్ద సేఫ్ కస్టడీ నిమిత్తం పెద్దల సమక్షంలో ఉంచి ఉండగా మా క్లయింట్ ది.10-12-2022న వెళ్ళి అడుగగా వారు తమవద్ద లేవని చెప్పగా మా క్లయింట్ నల్లపాడు పోలీస్ స్టేషన్ కు వెళ్ళి ది.13-12-2022న పోలీసు వారికి రిపోర్ట్ ఇవ్వగా పోలీస్ వారి సూచనల మేరకు పెద్దల సమక్షంలో ది:19-12-2022న సదరు దస్తావేజులు పోయినవని నిర్ధారించుకుని మా క్లయింటు వాటిని వెతికే ప్రయత్నాలు చేయుచున్నారు. అందులో భాగంగా ఈ పత్రికా ప్రకటన ద్వారా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై దస్తావేజులు దొరికిన వారెవరైనా క్రింద తెలిపిన చిరునామాకు అందజేసిన యెడల వారికి తగిన పారితోషికం ఇవ్వబడును. అలా కాక వాటిని చట్టవిరుద్ధంగా ఎవరైనా ఉపయోగించిన యెడల వారిపై సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకొనబడునని తెలియజేయడమైనది.

పొన్నారి బాలదస్తగిరి, గూడూరి అశోక్‌కుమార్,
న్యాయవాదులు డోర్ నెం:12-15-466,1/3,
ఓల్డ్ పట్టాభిపురం, పట్టాభిపురం పోస్టు,
గుంటూరు టౌన్, - పిన్:522006
సెల్: 9030666037,8121890884

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

ఎస్టీలకు గర్వకారణం 'డాక్టర్ కుంభ రవిబాబు'

విశాలాంధ్ర-గుంటూరు : అత్యంత వెనుకబడ్డ గిరిజన ప్రాంతం నుంచి ఉన్నత విద్యావంతుడుగా, శాసనసభ్యునిగా పనిచేసి ప్రస్తుతం తొలి నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేస్తున్న డాక్టర్ కుంబా రవిబాబును గవర్నర్ కోటా కింద శాసనమండలి ప్రజాప్రతినిధిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంపిక చేయటం రాష్ట్రంలోని లక్షలాది మంది గిరిజనులకు గర్వకారణమని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, జిల్లా విశ్రాంత ఎడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. ఎమ్మెల్సీగా డాక్టర్ కుంభ రవిబాబు ఎంపికైన సందర్భంగా స్థానిక అమరావతి రోడ్డు శ్రీనగర్ నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా కార్యాలయంలో మంగళవారం అభినందన సభ నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మేడ రాంబాబు అధ్యక్షతన జరిగిన గిరిజనుల సమావేశంలో రాష్ట్ర నాయకులు, తుళ్లూరు మండల వైసీపీ ఎస్టీ సెల్ అధ్యక్షులు పాలపర్తి రామారావు మాట్లాడుతూ గిరిజన నాయకుడిగా డాక్టర్ రవిబాబు దశాబ్దాలుగా తమ సమస్యలపై పోరాడుతూ గిరిజనులందరినీ ఏకతాటిపై నడుపుతున్నారని చెప్పారు. ఫెడరేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మేడా రామకృష్ణ, వజ్రగిరి కొండలు, కొజ్జా వెంకటేశ్వర్లు, కట్ట పద్మ, ఫిరంగిపురం సర్పంచ్ మేడా బాబు పాల్గొన్నారు.

ప్రజా చైతన్యం ద్వారానే మాతృబాష పరిరక్షణ

విశాలాంధ్ర-గుంటూరు : ఇతర భాషలో ఎన్ని నేర్చుకున్నా అమ్మ భాష పట్ల ఆపేక్ష, మమకారంతో వాడుక భాషగా మారడం ద్వారా ప్రజలు ఇష్టపూర్తిగా కొనసాగించటం ద్వారానే మాతృభాష పరిరక్షణ జరుగుతుందని అన్నమయ్య గ్రంథాలయ వ్యవస్థాపకులు లంకా సూర్యనారాయణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ మాతృభాషా దినోత్సవం సంద ర్భంగా స్థానిక బృందావన్ గార్డెన్స్ అన్నమయ్య పార్కులో ఉన్న తెలుగు తల్లి విగ్రహానికి కవులు, రచయితలు, తెలుగు భాషాభిమానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ తెలుగు భాష అమలు, పరిరక్షణ పట్ల పాలకుల వైఖరి మారాలని తెలుగు తల్లి విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఎంఎస్ సుభాని, డాక్టర్ వి.నాగరాజ్యలక్ష్మి, డాక్టర్ ఎం.లలిత కుమారి, రామశేషు, బి.ఉమా మహేశ్వర రెడ్డి, నాన, వి.వశిష్ట, తాటికోళ్ల పద్మావతి, డి.అనిల్ కుమార్, వి.సుబ్రహ్మణ్య ప్రసాద్, ఎం.గాయత్రి, కొనతం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బీసీలను చైతన్యపరచాలి

విశాలాంధ్ర-గుంటూరు : వైసీపీ ప్రభుత్వం అవలంభిస్తున్న బీసీ సామాజిక వర్గ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళి బీసీలను చైతన్యపరచాలని టీడీపీ జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. తెలుగుదేశం పార్టీ గుంటూరు జిల్లా బీసీ సామాజిక వర్గాల కోఆర్డినేటర్‌గా మద్దిరాల గంగాధర్‌ను నియమించినందుకు జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్‌ను మంగళవారం మద్దిరాల గంగాధర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ టీడీపీ మాత్రమే బీసీలను ఆర్థికంగా, రాజకీయంగా, సమాజంలో తగిన గుర్తింపునిచ్చిం దని తెలిపారు. పార్టీని అధికారంలోకి తేవడానికి బీసీలందరిని ఐక్యం చేయాలని గంగాధర్‌ని కోరారు.

'మహిళలను వంచిస్తున్నారు'

విశాలాంధ్ర-మంగళగిరి : పార్లమెంట్‌లో 1996లోనే మహిళా బిల్లు ప్రవేశపెట్టి దానిని ఆమోదించకుండా మహిళలను వంచిస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. మంగళగిరి బీసీ సంక్షేమ సంఘం నియో జకవర్గ కార్యాలయంలో కేశన శంకరరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కాంద్రు కమల ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ అధ్యక్షతన మంగళవారం పార్లమెంట్‌లో మహిళా బిల్లు గురించి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేశన శంకరరావు మాట్లాడుతూ గత ఎన్నికల మేనిఫెస్టోలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఇద్దరూ చిత్తశుద్ధితో పనిచేయడం లేదని అన్నారు. కోవెలకారు శివరాం బావాజీ, కాగితాల స్వాతి, ఉడతా శ్రీను, తిరువీధుల కిరణ్, ఆలా శివాజీ, మరీదు పుష్పాంజలి, మంద్రు సత్యనారాయణ, యనుమల నరసింహారావు, మాదు నాగ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు ప్రకాశం జిల్లా, బింగినపల్లి గ్రామము మరియు మండలం, గ్రామ కాపురస్తురాలు అబ్బూరి వసంతి భర్త తెనాలి రాము, తండ్రి అబ్బూరి మురళి మోహనరావు సెల్ : 9848611502, ప్రస్తుతం నివాసం మక్కెవారిపేట, నవులూరు గ్రామము, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా, గారి సంజాయిషీ పొంది యవన్మందికి తెలియజేయునది ఏమనగా,

దిగువ షెడ్యూలు దాఖలాస్తిని నేలపాటి సురేష్ తండ్రి నేలపాటి నాగేశ్వరరావు డోర్ నెం. 6-93, మందడం గ్రామము, తుళ్ళూరు మండలం, గుంటూరు జిల్లా వారినుండి కొనుగోలు చేయుటకు విక్రయ ఖరారు పడినారు. సదరు ఆస్తి తనకు తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ సిటీ, తిరుమలగిరి రోడ్, రోడ్ నెం. 6 మాదవపూరి హిల్స్, పి.జె.ఆర్ ఎన్‌క్లేవ్ ప్లాటు నెం. 154బి453 వీరు కాపురస్తురాలు పళ్ళేటి చిరంజీవి గారి కుమార్తెను, నేలపాటి రాజేంద్రప్రసాద్ వారి భార్య అయిన పళ్ళేటి చైతన్య వారి ద్వారా విక్రయం పొందినారు అని తెలియజేసినారు. సదరు ఆస్తి తన స్వాధీన, హక్కు భుక్తములలో, ఉన్నట్లు తనకు మాత్రమే విక్రయాధికారములు ఉన్నట్లునూ, మరియు సదరు ఆస్తిపైన ఎటువంటి లిటిగేషన్లు లేవనియూ, తను ఎవ్వరికి ఎటువంటి అన్యాక్రాంతములు చేయలేదని మా క్లయింటును నమ్మించి విక్రయ ఖరారుపడినారు. ఎవరికైనా సదరు విక్రయ ఖరారుపైన ఎటువంటి అభ్యంతరములు ఉన్నను ఈ బహిరంగ ప్రకటన నుండి వారం రోజులలోగా లిఖిత పూర్వకంగా నా క్లయింటుకు గాని, నాకు గాని తెలియజేయవలెనని, అట్లు తెలియజేయనిచో సదరు ఆస్తి నిర్వివాద ఆస్తిగా భావించి నా క్లయింటు రిజిస్ట్రర్ చేయుంచుకొందురని, తదుపరి వచ్చిన అభ్యంతరములు నా క్లయింటును బైండ్ చేయజాలవని తెలియజేయటమైనది.

షెడ్యూలు : గుంటూరు రి.డి. మంగళగిరి సబ్.డి. మంగళగిరి రెవిన్యూ మండలంలో చేరిన నవులూరు గ్రామ పంచాయితీ యిలాకా, నవులూరు గ్రామం తాలుకు డి. నెం. 199/ఎ రు య. 3-28 శెంట్ల మంజువలె డి. నెం. 199/బి రు య. 3-38 శెంట్లు మింజువలె వెరసి రెండు నెంబర్ల బాపతు నవులూరు గ్రామం డోర్ నెం.4-89 రు కు సమీపమున గల ప్లాటు నెం. 26 రులో దక్షిణం వైపు భాగం చ.గ. 170ల ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు:
తూర్పు : వేమూరి ప్రసాదావుగారి ప్లాటు నెం.25రు స్థలం హద్దు. అ. 25-9 1/2లు. దక్షిణం : జంధ్యాల అన్నపూర్ణమ్మ గారి ఆస్తి హద్దు. అ. 60 లు. పడమర : అ. 24 లు వెడల్పు గల రోడ్డు హద్దు అ. 25-2లు ఉత్తరం : గద్దం శ్రీనివాసరావు గారి సదరు ప్లాటులో భాగం హద్దు అ. 60 లు.

ఈ హద్దుల మధ్య చ.గ. 170 లు లేక చ.మీ. 142.13 ర్లు ఖాళీ నివేశన స్థలము మాత్రం యిందుకు లోగాయున్న యావత్ యాజ్మెంట్ హక్కులతో సహా,

బి. నాయుడమ్మ, పి, సురేష్,
న్యాయవాదులు, మంగళగిరి,
సెల్ నెం. 7995287256.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

నేడు వేల్పూరులో సచివాలయం ప్రారంభం

విశాలాంధ్ర-శావల్యాపురం : మండలంలోని వేల్పూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్ నెస్ సెంటర్లను బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక శాసనసభ్యులు బొల్లా బ్రహ్మ నాయుడు ప్రారంభించనున్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్ తెలిపారు. మండల, గ్రామ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయంతం చేయాలని కోరారు.

ఉపాధి హామీ కూలీకి పాము కాటు

విశాలాంధ్ర-శావల్యాపురం : ఉపాధి హామీ కూలికి పాము కరచిన ఘటన మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బొందిలపాలెం ఎస్సీ కాలనీకి చెందిన రాయనూతల ఈశ్వరయ్య(40) ఉదయం ఉపాధి హామీ పథకం క్రింద పనులకు వెళ్లి పనిచేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. వెంటనే స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో 108 సిబ్బంది వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఏపీఓ ఎంవీవీ రాజు ఆసుపత్రికి వెళ్ళి బాధితుడిని పరామర్శించారు.

కెనాల్లో పడి ఇద్దరు యువకులు గల్లంతు

విశాలాంధ్ర - నకరికల్లు : గుంటూరు బ్రాంచ్ కెనాల్లో పడి ఇద్దరు యువకులు మంగళవారం గల్లంతయ్యారు. ప్రమాద వివరాలు ఇలా ఉన్నాయి. కండ్లకుంట గ్రామం వద్ద ఉన్న గుంటూరు బ్రాంచ్ కెనాల్‌లో గోపి (21), ముస్తఫా (25) అనే ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. గల్లంతైన ఇరువురూ గుంటూరు స్వర్ణ భారత్ నగర్‌కు చెందిన వారిగా గుర్తించారు. యువకులు బైక్ రోడ్డుపై నిలిపి బ్రాంచ్ కెనాల్లో దిగగా ప్రమాదవశాత్తు మునిగిపోయారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు.

వైసీపీలోకి రుద్రవరం టీడీపీ నేతలు

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : అచ్చంపేట మండలంలో టీడీపీకి ఎదురుదెబ్బ తగిలింది. టీడీపీ బూత్ కన్వీనర్‌గా క్రియాశీలకంగా పనిచేసిన రుద్రవరం గ్రామానికి చెందిన మాగం శ్రీనివాసరావు, మాగం భాస్కరరావు, మాగం వినోద్ తమ కుటుంబాలతో సహా వైసీపీలో చేరారు. రుద్రవరంలో పర్యటించిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. స్వయంగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే వచ్చే ఎన్నికల్లో వైసీపీని గెలిపించేందుకు కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మహిళా నేత నంబూరి వసంతకుమారి, అచ్చంపేట మండలం వైసీపీ కన్వీనర్ చిలకా చంద్రయ్య, జడ్పీటీసీ సభ్యులు విజయ ప్రతాప్ రెడ్డి, సాయిరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, రోశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ సాధనకై కోటి సంతకాల సేకరణ

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు జనాభా ప్రాతిపదికన 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి, పెదకూరపాడు నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జ్ ఆర్కే ఒక ప్రకటనలో అన్నారు. 1952 తరువాత ఇంతవరకు బీసీ కులజనగణ జరగలేదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్నా మెజారిటీ ప్రజలైన బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. జనాభాలో బీసీలు 50 శాతం పైగా ఉన్నా ఇంకా విద్యా, ఉద్యోగ, రాజకీయ ఆర్థిక రంగాల్లో వెనకబడి ఉన్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే కులజనగణ చేపట్టి బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రేపటి నుంచి బీసీ కులజనగణ చేపట్టాలని పెదకూరపాడు నియోజకవర్గంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు.

అధికారుల ఆకస్మిక పర్యటన

విశాలాంధ్ర-యడ్లపాడు : మండల కార్యాలయాన్ని పల్నాడు జిల్లా సంయుక్త కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో జిల్లా సర్వే డివిజనల్ ఇన్‌స్పెక్టర్ పార్థసారథి సహకరించారు. రీ సర్వేపై ఈ తనిఖీ చేసినట్లు మండల తహాశీల్దార్ నాంపల్లి నాగమల్లేశ్వర రావు తెలిపారు. సర్వే ప్రక్రియ పూర్తి అయిన గ్రామాల్లో హద్దు రాళ్లు పాతాలన్నారు. పాత రికార్డులను పరిశీలించారు. మండల సర్వేయర్ రాంబాబు, గ్రామాల సర్వేయర్‌లతో గ్రామాల వారీగా క్షుణ్ణంగా వివరాలను అడిగి తెలుసుకొన్నారు. పలు సూచనలు, సలహాలను చేసినట్లు తహాశీల్దార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా ఈ సమావేశం తలుపులు వేసుకొని మరీ నిర్వహించటం, విలేకర్లను కూడా అనుమతించకపోవటం కొసమెరుపు.

పరుచూరి శ్రీనివాసరావుకు నివాళి

విశాలాంధ్ర-అమరావతి : మండలంలోని పెద్దమద్దూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పరుచూరి శ్రీనివాసరావు అనారోగ్యంతో మంగళవారం మరణించారు. వారి భౌతికకాయానికి పూలమాలవేసి పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు నివాళులర్పించి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

దాడులను ఖండించిన టీడీపీ

విశాలాంధ్ర-పెదకాకాని : జగన్ వ్రాసిన రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర పోలీసులు కొంతమంది నడుస్తున్నారనడానికి గన్నవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై వైసీపీ నాయకులు దాడి చేయటం వారిని అడ్డుకోవటం కోసం వచ్చిన తెలుగుదేశం పార్టీ నాయకులుపై దౌర్జన్యం చేయటం, కారు తగలపెట్టం, ఫర్నిచర్‌లు ధ్వంసం చేయటం ఇవన్ని పోలీసులు సమక్షంలో చేయటం సిగ్గుచేటని టీడీపీ మండల నాయకులు ఆరోపించారు. బీసీ నాయకుడు ఇంటిపై, తెలుగుదేశం కార్యాలయంపై దౌర్జన్యం చేసినవారిపై కేసులు పెడతానికి వెళ్లినవారిని పోలీసులు అదుపులో తీసుకొని వైసీపీ నాయకులు చెప్పిన విధంగా వారిని హింసించి వారిపై కేసులు పెట్టడం దుర్మార్గమని అన్నారు. ఎన్ని కేసులు పెట్టిన ప్రజల తరుపున ప్రభుత్వంపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ నాయకులు, మండల అనుబంధ కమిటీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'కన్నా' నిర్ణయాన్ని స్వాగతించిన జనచైతన్య వేదిక

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో మార్పు రావడానికి కన్నా లక్ష్మీనారాయణ రాజకీయ నిర్ణయం దోహద పడుతుందని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తెలిపారు. మంగళవారం కన్నా లక్ష్మీనారాయణ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మరో బీహార్‌గా మారరాదని, అభివృద్ధి వైపు పురోగమించాలన్నారు. రాజధానిని మూడు ముక్కలు చేసినంతమాత్రాన అభివృద్ధి వికేంద్రీకరణ జరగదన్నారు. 26 జిల్లాలలో నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేయాలని, పరిశ్రమలు స్థాపించి ఉద్యోగ అవకాశాలను పెంచాలన్నారు. మేధావులు, రిటైర్డ్ అధికారులు, పలు ప్రజా సంఘాలను కలుపుకొని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి అధ్యయన వేదికను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

జగనన్న కాలనీల్లో ఇల్లు కట్టిన జాడ లేదు: మారుతి

విశాలాంధ్ర-బొల్లాపల్లి : మండలంలోని వెల్లటూరు గ్రామం జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, టిడ్కో గృహాలు వెంటనే పంపిణీ చేయాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ డిమాండ్ చేశారు. జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాల సందర్శనలో భాగంగా బొల్లాపల్లి మండలంలో సీపీఐ నాయకులు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా వెల్లటూరు గ్రామంలో జగనన్న కాలనీకి కేటాయించిన స్థలంలో ఒక ఇంటి నిర్మాణం కూడా జరగకపోగా చెట్లు, తుమ్మ కంపలు పెరిగి ఉన్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాల్లో ఇళ్ళ నిర్మాణాలు పూర్తవుతున్నాయని గొప్పగా ప్రకటనలు చేస్తున్నప్పటికీ ఇక్కడ కనీస వసతులు కూడా లేవని, ఇళ్ల పనులు ఏమాత్రం పూర్తికాలేదని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న కాలనీలలో ప్రభుత్వం ఒక సెంటు, సెంటున్నర, ఇళ్ల స్థలాలు ఇచ్చి రూ.1.80 లక్షలకే ఇల్లు కట్టుకోవాలని అలా కట్టుకొనని ఎడల ఇళ్ల పట్టాలు రద్దు చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన డబ్బులు ఇంటి నిర్మాణానికి చాలవని ప్రభుత్వం ఇచ్చే డబ్బులు పునాదుల వరకే వస్తాయని కాంట్రాక్టర్లు ఆ గృహాలు నిర్మిస్తే కుటుంబాలు నివాసాలు ఉంటానికి పనికిరావని అందువల్ల జగనన్న గృహాలకు రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ డిమాండ్ చేస్తున్నదని అన్నారు. బొల్లాపల్లి మండలంలో వెల్లటూరు గ్రామంలో జగనన్న కాలనీలో ఇల్లు కట్టిన పాపాన పోలేదని దాన్ని పరిష్కరించవలసిన బాధ్యత ప్రభుత్వందేనని ఆయన అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు కట్టించిన టిడ్కో గృహాలను తాము అధికారంలోకి వస్తే వెంటనే రూపాయి ఖర్చుతో పంపిణీ చేస్తామని జగన్‌మోహన్ రెడ్డి చెప్పారని ఇంతవరకు ఆ ఇళ్లు పంపిణీ చేయలేదని వెంటనే ఆ గృహాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. మార్చి 2వ తేదిన జగనన్న కాలనీ లబ్ధిదారులకు రూ.5 లక్షలు ఇవ్వాలని, టిడ్కో గృహాలను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ విజయవాడ పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తారని, ఈ ధర్నాలో జగనన్న కాలనీ లబ్ధిదారులు టిడ్కో గృహాల లబ్ధిదారులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ వినుకొండ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, బొల్లాపల్లి మండల కార్యదర్శి పిన్నబోయిన వెంకటేశ్వర్లు, మండల నాయకులు కండే నాసరయ్య, దశరథుడు, షేక్ రఫీ, కొప్పరపు మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సకాలంలో పూర్తి చేయాలి: జేసీ

విశాలాంధ్ర-నరసరావుపేట కలెక్టరేట్ : పల్నాడు జిల్లాలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్సు హాల్ నుంచి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానంగా జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం అమలు చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. రీ సర్వేలో డ్రాఫ్ట్ ల్యాండ్ రికార్డ్స్, సర్వే స్టోన్ ప్లాంటేషన్, ప్రభుత్వ, ప్రైవేటు భూముల గుర్తింపు, భూ హక్కు పత్రాల పంపిణీ అంశాలకు సంబంధించి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పనుల్లో వెనుకబడిన మండలాలను ప్రస్తావించి వేగంగా పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ ఆధారిత హాజరు రిజిస్ట్రేషన్స్ కార్యక్రమం సత్వరం పూర్తి చేయాలన్నారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత సమయంలో తప్పని సరిగా పరిష్కరించాలని సూచించారు. వన్ టైమ్ ల్యాండ్ కన్వర్షన్ పథకానికి సంబంధించి వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చుకునేందుకు అర్జీదారుల నుంచి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, పులిచింతల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వసంత బాబు, ఏడీ సర్వేశాఖ నాగశేఖర్, కలెక్టరేట్ ఎఓ. అనిల్‌కుమార్, ఎస్ఓలు కుటుంబరావు, యశోద తదితరులు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలంటూ సీపీఐ రాస్తారోకో

విశాలాంధ్ర-రొంపిచర్ల : స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద గల హైవే రోడ్డుపై ప్రమాదాలు జరగకుండా అండర్ గ్రౌండ్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలంటూ మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నరసరావుపేట ఏరియా సహాయ కార్యదర్శి వైదన వెంకట్ మాట్లాడుతూ హైవే రోడ్డుపై తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటి వరకు జరిగిన ప్రమాదాల్లో అనేక మంది మృత్యువాత పడ్డారని అన్నారు. నరసరావుపేట, చెన్నై, హైదరాబాద్, ఒంగోలు తదితర నగరాలకు, పట్టణాలకు వెళ్ళేందుకు ఇక్కడ హైవే రోడ్డు క్రాస్‌గా ఉందని, దీనివలన వాహనాలు ఇక్కడకు వచ్చేటప్పుడు తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రయాణీకులు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారని అన్నారు. ఇక్కడ అండర్ గ్రౌండ్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తే ప్రమాదాలు నివారించవచ్చునని అన్నారు. అధికారులు వెంటనే స్పందించి ప్రమాదములు జరగకుండా హైవే రోడ్డుపై అండర్ గ్రౌండ్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పోలీసులు జోక్యం చేసుకుని రాస్తారోకో విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రొడ్డా అంజిరెడ్డి, మండల నాయకులు చక్రవరం సుబ్బరాజు, వెంకటేశ్వరరావు, పిడెం హుస్సేన్, వ్యవసాయకార్మిక సంఘం మండల నాయకులు జమ్ములమూడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత లేని పనులకు నిధులు ఎందుకు: కౌన్సిలర్

విశాలాంధ్ర-వినుకొండ: వినుకొండ మునిసిపల్ సాధారణ సమావేశం మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో అనేక అంశాలపై చర్చ జరిగింది. ఎజెండా అంశాలలోని మొదటి అంశంగా ఉన్న అంశాన్ని అధికార పార్టీకి చెందిన 8వ వార్డు కౌన్సిలర్ పాపసాని బ్రహ్మయ్య ప్రశ్నించారు. పట్టణంలోని ఎనిమిదో వార్డులో ఇదివరకే మంచినీటి పైపులైను ఉన్నదని మరల మంచినీటి పైపులైను నిర్మాణం చేపట్టడం ఏంటని ప్రశ్నించారు? దీనికి మునిసిపల్ ఏ ఈ చంద్రశేఖర్ సమాధానం ఇస్తూ వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సదరు వార్డులోకి వచ్చినపుడు అక్కడ ప్రజలు మాకు మంచినీటి పైపులైను కావాలని అడిగి ఉన్నారని, పిమ్మట దానిని ఎజెండాలో పొందుపరచడం జరిగిందని బదులిచ్చారు. అయితే వార్డు కౌన్సిలర్ అయిన బ్రహ్మయ్య సదరు అంశాన్ని రద్దు పరచవలసినదిగా డిమాండ్ చేశారు. అధికార పార్టీ కౌన్సిలర్ అయిన బ్రహ్మయ్య నిధులు దుర్వినియోగం జరగకూడదని కోరారు. అనంతరం 19వ వార్డు కౌన్సిలర్ ఎమ్మెస్కె భాషా మాట్లాడుతూ పట్టణంలో 12సచివాలయులు సరిపోవడం లేదని, 16 లేదా 18 సచివాలయులు ఏర్పాటు చేయాలని కోరారు. సచివాలయాలలో కావలసిన మంచినీరు, స్టేషనరీ వంటి మౌళిక వసతులను సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా పట్టణ పరిధిలో వున్న విద్యుత్తు సమస్యలు త్వరగా పరిష్కరించాలని కోరారు. సమావేశంలో కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, డిఇ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

పిడతల అనిల్ కుమార్‌కు నియామక పత్రం అందజేత

విశాలాంధ్ర-వినుకొండ: మండల మాల మహానాడు అధ్యక్షులుగా పిడతల అనిల్ కుమార్‌కు నియమక పత్రాన్ని రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు డా గోదా జాన్‌పాల్ అందజేశారు. మంగళవారం అనంతరం గోదా జాన్ పాల్ మాట్లాడుతూ మండలం లోని మాలల ఐక్యత మరియు వారి అభివృద్ధి కొరకు పనిచేస్తూ జాతీయ మరియు రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు కట్టుబడి పని చేయాలని వర్గీకరణకు వ్యతిరేకంగా మాలల పక్షాన కట్టుబడి పని చేయాలని అన్నారు. పిడతల అనిల్ కుమార్ మాట్లాడుతూ గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి వారి సమస్యల పట్ల చిత్త శుద్ధితో కృషి చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ అధ్యక్షులు కోంద్రు విజయ్ వినుకొండ నియోజకవర్గ ఇన్చార్జి కీర్తిపాటి వెంకటేశ్వర్లు గౌరవాధ్యక్షులు కొమ్మతోటి కృపయా పట్టణ అధ్యక్షులు బేతం దేవానంద్ శావల్యాపురం మండల అధ్యక్షులు మాలపోలు ప్రకాష్ ప్రధాన కార్యదర్శి బొందలపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే దాడులా...

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ, ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తూ... రాష్ట్రాన్ని రావణకాష్టంలాగా తయారు చేసి ప్రజలను, ప్రతిపక్ష పార్టీలను భయభ్రాంతులకు గురి చేయాలని వైసీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని జిల్లా టిడిపి అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందన్నారు. గన్నవరం టిడిపి పార్టీ కార్యాలయంపై వైసీపీ రౌడీ మూకలు విచక్షణారహితంగా దాడి చేయడం, టిడిపి పార్టీ కార్యాలయంలోని సామాగ్రిని ధ్వంసం చేసి మారణహోమం సృష్టించడం... రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనకు పరాకాష్టని అన్నారు.

సీఐడీ విచారణకు హాజరైన మణిరత్నం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: విచారణ నిమిత్తం ఈ నెల 21 మంగళగిరిలోని సీఐడీ హెడ్క్వార్టర్స్‌కు రావాలని ఐటిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి బేతమాల మణిరత్నంకు (మంచోడు మణి) సీఐడీ అధికారులు నోటీసు ఇచ్చారు. ఈ నేపథ్యంలో మణిరత్నం మంగళవారం సీఐడీ విచారణకు హాజరయ్యారు. తీరా హాజరయ్యాక విచారణకు సరిపడా చోటు ఇక్కడ లేదంటూ గుంటూరు సిఐడి ప్రాంతీయ కార్యాలయంలో హాజరు కావా లంటూ మరో నోటీసు ఇచ్చినట్లు మణిరత్నం తెలిపారు. మధ్యాహ్నం 1 గంటకు గుంటూ రులోని సిఐడి కార్యాలయానికి హాజరైనారు. మణిని సీఐడీ అధికారులు విచారించారు. ఐటిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మణిరత్నంకి అండగా మంగళగిరి, గుంటూరు సిఐడి కార్యాలయాల వద్దకు గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ, జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షులు వేమూరి మైనర్ బాబు, ఎస్సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోడూరి అఖిల్, జిల్లా వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పొదిలి వాసు, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంచుమర్తి శేషు, ఐటీడీపి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గున్నారు.

ట్రక్ ఆపరేటర్స్‌కు దరఖాస్తు చేసుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో రైస్ కార్డు కలిగిన వారికి ఉచిత రేషన్, సరుకులు ప్రజల ఇళ్ళ వద్దకు సరఫరా చేయుటకు 3 మంది ఎండీయూ ట్రక్ ఆపరేటర్స్ భర్తీకి ఆసక్తి కల్గిన వారు దరఖాస్తు చేసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 31 జనవరి 2023 నాటికి 21-45 ఏళ్లలోపు ఉండి, 7వ తరగతి ఉత్తీర్ణతై, నెలకు రూ.12 వేలు ఆదాయము కలిగి, డ్రైవింగ్ లైసెన్స్ జారీచేసిన తేదీ నుండి ప్రస్తుతమునకు 2 సంవత్సరములు పైబడిన మైనారిటీ, క్రిస్టియన్ మైనార్టి అభ్యర్ధులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులు ఈ నెల 23 నుండి 27 వరకు జీఎంసీ ప్రధాన కార్యాలయములోని ఉపాసెల్ విభాగంలో దరఖాస్తును అందజేసి రశీదు పొందవలసినదిగా తెలిపారు.

వార్షిక రిటర్న్‌పై వడ్డీ, అపరాధ రుసుం తగ్గింపు హర్షణీయం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జీఎస్టీలో వార్షిక రిటర్న్స్‌కు సంబంధించి వడ్డీలు, అపరాధ రుసుములు కొంతమేర తగ్గించడం వ్యాపారస్తులకు స్వల్ప ఊరట లభించిందని జిల్లా టీడీపీ అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆడిటర్స్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల శ్రీనివాసరావు అధ్యక్షతన ఆడిటర్ల సమావేశం జరిగింది. శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 18వ తేదీన ఢిల్లీలో జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ జీఎస్టీ ఆర్9, 9సి వార్షిక రిటర్న్ ఆసల్యంగా దాఖలు పరచడంలో అపరాధ రుసుము, వాటిపై చెల్లించాల్సిన వడ్డీని సగము మేర తగ్గించేందుకు నిర్ణయం తీసుకోవడం హర్షదాయకమని అన్నారు. ఆడిటర్లకు ఎటువంటి సమస్య వచ్చినా తెలుగుదేశం పార్టీ తరుపున పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. దామచర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ అపరాధ రుసుములు తగ్గించడానికి సిబిఐసి చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించడానికి సహకారం అందించిన గుంటూరు పార్లమెంట్ సభ్యులు గల్లా జయదేవ్, శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడులకు ఆడిటర్స్ తరపున ధన్యవాదాలు తెలిపారు. దీనివలన రాష్ట్రంలో సుమారు 5 వేలమందికి పైగా వ్యాపారస్తులకు ఊరట కలిగించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆడిటర్స్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూ.ఎస్.ఎన్ రాజు, రామరాజు శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి కె. కోటేశ్వరరావు, కోశాధికారి జె. సురేష్ కుమార్, ఫణి రాజు కుమార్, జొన్నలగడ్డ సత్యనారాయణ వివిధ జిల్లాల ఆడిటర్లు పాల్గొన్నారు.

బెస్ట్ యూనివర్సిటీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-తాడేపల్లి : యూజీసీ పర్మిషన్స్ అండర్ ప్రాసెస్‌లో ఉండగానే అక్రమంగా లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్న సత్య సాయి జిల్లాలో ఉన్న బెస్ట్ యూనివర్సిటిని టర్మినేట్ చేయాలని, విద్యార్థి మనోహర్ ఆత్మహత్యకి పాల్పడే విధంగా ప్రేరేపించిన డిప్యూటీ వైస్ ఛాన్సలర్ చిత్రరాయి సెల్వన్, రాజన్నలను వెంటనే అరెస్టు చేయాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న బెస్ట్ యూనివర్సిటీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని హయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మెన్ కె.హేమచంద్రరెడ్డిని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు కోరారు. తాడేపల్లిలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి రాష్ట్ర కార్యాలయంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.హేమచంద్రా రెడ్డికి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయి కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల నాసర్ జీ మాట్లాడుతూ శ్రీసత్య సాయి జిల్లా గోరంట్లలో ఉన్న ప్రయివేటు బెస్ట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ యాజమాన్యం అధిక ఫీజుల పేరుతో విద్యార్థులను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. అందుకే 4వ సంవత్సరం చదువుతున్న మనోహర్ అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడడంతో విద్యార్థులు స్వచ్ఛందంగా క్లాసులు బహిష్కరించి యూనివర్సిటీ ముందు బైఠాయించారని వారికి మద్దతుగా వారి సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి మద్దతిస్తుందని తెలిపారు. యూనివర్సిటీలో అక్రమంగా వేస్తున్న ఫైన్స్‌ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బెస్ట్ యూనివర్సిటీ యాజమాన్యం యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా గుర్తింపు ఇవ్వకుండానే అండర్ ప్రాసెస్‌లో ఉండగా అక్రమంగా అగ్రికల్చర్ కోర్సుకు రూ.4 లక్షల ప్యాకేజీని రూ.9 లక్షలు ఇవ్వాలని విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ప్రతి సెమిస్టర్ ఫీజును రూ.300 నుంచి రూ.800 నుంచి రూ.1200 వరకు పెంచి అక్ర మంగా డబ్బులు దండుకుంటున్నారని అన్నారు. అధిక ఫీజులు ఎందుకని ప్రశ్నించిన వారిని యూనివర్సిటీ డిప్యూటీ వైస్ ఛాన్సలర్ చిత్తరాయి సెల్వన్ తన సిబ్బంది గంగరాజు, రాజన్న, అర్చన, చిదానందంలతో కలిసి పది మంది విద్యార్థులను సస్పెండ్ చేయడం, సెమిస్టర్ ఫీజు రూ.50లు కట్టకపోయినా రూ.5000 నుంచి రూ.70 వేల వరకు ఫైన్ వేయడం లాంటి నిర్ణయాలు యాజ మాన్యం తీసుకోవడం వల్ల విద్యార్థులు తీవ్ర భయభ్రాం తులకు ఇబ్బందులకు గురికావడం జరుగుతోందని అన్నారు. కొంతమంది ఒరిజినల్ సర్టిఫికెట్లని యాజమాన్యం మాయ చేసి బోర్డులో తెచ్చుకోండని చేతులు దులుపుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా స్పందించి బెస్ట్ యూనివర్సిటీ యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని కోరారు. లేకపోతే భవిష్యత్తులో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ నగర నాయకులు బేవర సుధీర్, జగదీష్, రంజిత్, అభిషేక్, బెస్ట్ యూనివర్సిటీ విద్యార్థి అమృత్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా చెన్నకేశవ

విశాలాంధ్ర-సత్తెనపల్లి : వినియోగదారుల సమన్వయ సమితి(సీసీఐ) రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా పల్నాడు జిల్లా, సత్తెనపల్లికి చెందిన వల్లెం లక్ష్మీ చెన్నకేశవ రావుని నియమించారు. సోమవారం విశాఖపట్నం వైష్ణవ్ గ్రాండ్ కాన్ఫిరెన్స్ హాల్‌లో సీసీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జాతీయ వినియోగదారుల సమన్వయ సమితి జాతీయ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ చదలవాడ హరిబాబు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం సీసీఐ జాతీయ స్థాయిలో కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీసీఐ విశాఖ చాప్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ ముత్యాల బాలాజీ పాల్గొన్నారు. జనరల్ సెక్రటరీగా డి. ఇమ్మానియేలు, రాష్ట్ర సమాచార ప్రచార కార్యదర్శిగా హెచ్ఎస్ రామ కృష్ణ, కార్యవర్గ సభ్యునిగా పేట బాలకృష్ణని నియమిస్తూ తీర్మానం చేశారు.

టీడీపీ నాయకుడు వెన్న బాలకోటి మృతి

విశాలాంధ్ర-నరసరావుపేట : గత 20 రోజుల క్రితం ప్రత్యర్థులు రివాల్వర్‌తో కాల్పులు జరిపిన సంఘటనలో గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రొంపిచర్ల మండలం తెలుగు పార్టీ అధ్యక్షులు వెన్న బాలకోటి రెడ్డి(72) గుంటూరులోని ప్రైవేట్ హాస్పటల్లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. గ్రామంలో రాజకీయ ఆధిపత్య పోరులో బాలకోటిరెడ్డిని స్వగ్రామైన అలవాలలో ఇంట్లో ఉండగా రాత్రి 10 గంటల సమయంలో రివాల్వర్‌తో కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో గాయపడిన బాలకోటి రెడ్డి నరసరావుపేటలో, గుంటూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో 20 రోజులుగా వైద్య చికిత్సలు పొందుతున్నారు. బాలకోటిరెడ్డిని వైసీపీ నాయకుల అండదండలతో ప్రత్యర్థులు కాల్పులు జరిపారని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపించారు. ఆసుపత్రిలో మృతి చెందిన బాలకోటిని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ అరవింద బాబు, పలువురు నాయకులు సందర్శించారు.

ప్రశ్నిస్తే దాడులు చేస్తారా: బ్రహ్మారెడ్డి

విశాలాంధ్ర-మాచర్ల : అధికార పార్టీ తప్పిదాలను ప్రశ్నిస్తే ప్రతిపక్షంపై దాడులకు పాల్పడటం అప్రజాస్వామికమని టీడీపీ మాచర్ల నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గన్నవరం టీడీపీ కార్యాలయం, పార్టీ బీసీ నాయకులు, కార్యకర్తలుపై వైసీపీ నాయకుల దాడి, అరాచకాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైసీపీ నాయకులు ప్రశ్నించిన వారిపై దాడులు జరుపుతా ఉంటే పోలీసులు చోద్యం చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పాయని అన్నారు. దాడులకు పాల్పడిన వారికి పోలీసులు మద్దతు తెలుపుతూ, ఫిర్యాదు చేసిన వారిపై కేసులు నమోదు చేయడంలో పోలీసుల వైఖరి స్పష్టంగా అర్థమవుతుందన్నారు. రోజురోజుకి టీడీపీ ప్రజాదరణ జరుగుతుందన్నారు. అధికార పార్టీ అరాచకాలను తిప్పి కొట్టే సమయం దగ్గర పడిందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నామినేషన్ కార్యక్రమం జయప్రదం చేయండి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : నిత్య కృషీవలుడు అనంతపురం కడప కర్నూలు ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు కత్తి నరసింహారెడ్డి, గ్రాడ్యుయేట్ నియోజకవర్గం పోతుల నాగరాజుల నామినేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి పోటు శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం చిలకలూరిపేట పట్టణంలోని రాష్ట్ర ఉపా ధ్యాయ సంఘం ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమ మాతృక ఎస్టీయూ ఏకైక శాసనమండలి సభ్యుడు కత్తి నరసింహారెడ్డి తిరిగి మరలా అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ బాలికల స్కూల్ టీచర్స్, మున్సిపల్ స్కూల్ టీచర్స్, గురుకుల పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు విద్యార్థులు పెన్షనర్స్ అందరికోసం ఒక్కడై పోరాటం చేసిన యోధుడని అన్నారు. ప్రజా సమస్యల పట్ల చక్కటి అవగాహన కల్గి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసే కత్తి నరసింహారెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, పట్టణ అధ్యక్షుడు మేకల కోటేశ్వరరావు, కార్యదర్శి షేక్ జమీర్ బాషా, అంకమ్మరావు, సాగర్ బాబు, వెంకట స్వామి ఏడుకొండలు, రాజేష్, విజయ భాస్కర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక విప్లవానికి పెద్దపీట

విశాలాంధ్ర-చిలకలూరిపేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించిన 18 మంది ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అత్యదికంగా ఇవ్వడం ద్వారా సామాజిక న్యాయం మాటల్లో కాకుండా ఆచరణలో చూపి అట్టడుగు వర్గాల హృదయం దోచుకున్న జగన్‌మోహన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతాడని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు, రాష్ట్ర అధ్యక్షుడు అడపా మోహన్ మాదిగ పేర్కొన్నారు. మంగళవారం అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జగజ్జీవన్ రాం కన్న ఆశయాలు దేశానికి స్వతంత్ర వచ్చినాక మునపెన్నడు లేనివిధంగా, తూర్పుగోదావరి జిల్లాలో మొట్టమొదటిసారిగా మాదిగలకు చట్టసభల్లో అదికూడా పెద్దల సభకు సామాన్యుడు అయిన బొమ్మి ఇజ్రాయెల్‌ని పంపడం జగన్‌మోహన్ రెడ్డికి ఉన్న దూరదృష్టికి నిదర్శనమన్నారు.

నియంతలా పాలిస్తే ప్రజలు ఊరుకోరు

విశాలాంధ్ర-చిలకలూరిపేట : రాష్ట్రంలో వైసీపీ ప్రజా వ్యతిరేక పాలనను ప్రజలు అసహ్యించుకుంటున్నారని, టీడీపీకి వస్తున్న ప్రజాదరణను చూసి వైసీపీకి వణుకుపుడుతుందని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. టీడీపీ కార్యాలయంపై దాడి చేసి, వాహనాలను ధ్వంసం చేసి, టీడీపీ నాయకులపై వైసీపీ అరాచక శక్తులు చేసిన దాడి చూస్తుంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవనేది స్పష్టమవుతుందన్నారు. రక్షణ కల్పించాల్సిన పోలీసులు వైసీపీ సానుభూతిపరుల వలె వ్యవహరించడం అప్రజాస్వామికమని అన్నారు. వారు చేసే ఇలాంటి నియంత పాలనపై గవర్నర్ చర్యలను తీసుకోవాలని ప్రత్తిపాటి అన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

విశాలాంధ్ర-పొన్నూరు : పొన్నూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని చేబ్రోలు మండలం సుద్దపల్లి యూనిట్ శలపాడు గ్రామంలో మంగళవారం పొలంబడి కార్యక్రమం జరిగింది. పొలంబడి కార్యక్రమంలో స్టేట్ ఎస్‌పీఎంయూ వెంకట్రావు మాట్లాడుతూ పొలంబడి కార్యక్రమంలో రైతులకు వివిధ పంటలపై మెలకువలను వివరించి ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఖరీఫ్ సాగు ప్రారంభంలో 30 రకాల విత్తనాలు భూమిలో చల్లడం ద్వారా భూమిలో కర్బనం వృద్ధి చెంది నేల సారవంతంగా మారి అధిక దిగుబడులు ఇస్తుందని రైతులకు వివరించారు. దీని ద్వారా సేంద్రీయ కర్బనం మొక్కకు కావలసిన అన్ని పోషకాలు ఇస్తుందని రసాయనాలు వాడకుండా ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకొని అధిక దిగుబడులు పొందాలని ఆయన కోరారు. ప్రకృతి వ్యవసాయంపై ప్రకృతి వ్యవసాయాధికారి ఎస్.ఉమాదేవి అవగాహన కల్పించారు. పేడ మూత్రం, ఇంగువ ద్రావణం తయారు చేయటం జరిగింది. ఈ ద్రావణం వల్లన లాభాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో మార్చి 15 నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలు పగడ్బందీగా నిర్వ హించడానికి చర్యలు తీసుకోవాలని ఇన్ఛార్జ్ కలెక్టర్ కె.శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని ఆయన ఛాంబర్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మార్చి 15వ తేది నుండి ఏప్రిల్ 3వ తేదీ వరకు ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయన్నారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 8,759 మంది, రెండవ సంవత్సరం పరీక్షలకు 10,474 మంది విద్యార్థులు మొత్తం19,223 మంది హాజరు కానున్నారన్నారు. జిల్లాలో పరీక్షల నిర్వాహణకు 34 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు నిర్వహించే కేంద్రాల్లో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా మెడికల్ క్యాంప్లు ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. పరీక్షలు జరిగే ప్రాంతాల్లో ఆర్.టి.సి బస్ సౌకర్యం కల్పించాలని రవాణా శాఖ అధికారులకు చెప్పారు. ఈ సమావేశంలో డిస్ట్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ అంజనేయులు, జిల్లా పంచాయతీ అధికారి శంకర్ నాయక్,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉపాధి శిక్షణ

విశాలాంధ్ర - రేపల్లె : మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ మరియు ఎలిప్ సంస్థా సంయుక్త ఆధ్వర్యంలో దాతల సహకారంతో మహిళలకు ఉపాధి శిక్షణా తరగతులు నిర్వహించనునట్లు ఎంసీఏ మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ వి.ప్రకాశరావు తెలిపారు. స్థానిక శ్రీగుత్తికొండ లక్ష్మీనారాయణ కళ్యాణ మండపంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్చి 1 వతేదీ నుంచి మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ జూట్ బ్యాగ్ల తయారీ, ఫ్యాషన్ డిజైనింగ్పై రెండు నెలలు పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికేట్లు అందజేస్తారన్నారు. ఆసక్తి కలవారు ఈ నెల 26వ తేదీ లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు మేనేజర్ 9849604205 నెంబర్ను సంప్రదించా లని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంసీఏ కార్యదర్శి జీ బాపారావు, సభ్యులు వాసుదేవరావు, లక్ష్మీనారాయణ, వేజళ్ల చక్రపాణి, కేవీ సుబ్బారావు పాల్గొన్నారు.

దశదినకర్మకు హాజరైన చైతన్య



విశాలాంధ్ర - బల్లికురవ : మండల పరిధిలోని వేమవరం గ్రామ సర్పంచి దూళిపాళ్ల వెంకట సుబ్బయ్య తల్లి మంగమ్మ ఇటీవల మృతి చెందారు. మంగళవారం మంగమ్మ దశదిన కర్మకు శాపు నేట్ చైర్మన్ అద్దంకి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బాచిన కృష్ణ చైతన్య హాజరై మంగమ్మ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈయన వెంట సంతమాగులూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చింతల పేరయ్య నక్కబొక్కలపాడు సర్పంచి దూళిపాళ్ల బుల్లిరామయ్య స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

రోడ్డు విస్తరణకు చెట్లు తొలిగింపు

విశాలాంధ్ర-పర్చూరు: పర్చూరు నుండి ఇంకొల్లు వరకు 22 కిలోమీటర్ల మేర రోడ్డు గుంతలు ఏర్పడి ప్రయాణికులకు, వాహనదారులకు, రైతులకు సమస్యగా ఉన్నది. అధికారుల నిదేదిక ద్వారా అంచనాలను తయారు చేసి ప్రభుత్వంకు అందించగా... రోడ్డు విస్తరణకు, బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.24 కోట్లు మంజూరు చేసింది. దానిలో భాగంగా రోడ్డు నిర్మాణంకు వైసీపీ ఇన్చార్జి ఆమంచి కృష్ణమోహన్ ఇటీవల శంఖుస్థాపన చేయగా, రోడ్డు పనులు జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణలో అడ్డుగా వచ్చిన చెట్లను తొలగిస్తున్నారు. రోడ్డు నిర్మాణం అనంతరం మొక్కలు నాటుతామని అధికారులు తెలిపారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే ప్రయాణానికి సౌకర్యంగా ఉంటుందని వాహనదారులు తెలిపారు.

పూర్వ విద్యార్థికి సన్మానం



విశాలాంధ్ర - జె.పంగులూరు : మండలంలోని చందలూరు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న ఆర్వో ప్లాంట్ రూ. 60 వేలతో ఆధునీకరించిన పాఠశాల పూర్వ విద్యార్థి రావూరి శివరామ ప్రసాద్కు అభినందన సభ మంగళవారం జరిగింది. ఈ సభకు అధ్యక్షత వహించిన ప్రధానోపాధ్యాయులు గుమ్మా శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ఆధునికరించడం వలన విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరును అందించే అవకాశం ఏర్పడిందని ఆర్వో ప్లాంట్ ఆధునీకరణ పనులకు రూ. 60 వేల ఆర్థిక సహాయాన్ని అందించిన శివరామ ప్రసాద్కు ధన్యవాదాలు తెలియజేశారు. సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లిన పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు తాతయ్య మాస్టారుకు, ఆధునీకరణ పనులను దగ్గర ఉండి పని పూర్తి చేయించిన పాఠశాల ప్రధానదాత వారసుడు అడ్డగడ సుబ్బయ్యకు, సమన్వయం చేసిన ఉపాధ్యాయుడు శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రావూరి ఉమామహేశ్వరరావు, చిట్టా బత్తిన శేషారావు పాల్గొన్నారు. అనంతరం శివరాం ప్రసాద్, ఆయన తండ్రి ఉమామహేశ్వరరావును పాఠశాల సిబ్బంది సన్మానించారు.

అంతర్జాతీయ మాతృభాషాదినోత్స సభ

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : మాతృభాషను మర్చిపోవడం అంటే మన తల్లిని మనం మరిచిపోయినట్లేనని సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు జి.వి బ్రహ్మం తెలిపారు. సాహితీ భారతి ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో మంగళవారం ఉదయం జరిగిన మాతృభాష దినోత్సవ సభలో బీడీ ప్రసాద్ (బందాబాబు) మాట్లాడుతూ మాతృభాష మృత భాష కారాదని ,తల్లిదండ్రులు పిల్లలకు చిన్నతనం నుండే మాతృభాషను అలవాటు చేసి భాష అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు భాషకు సేవ చేసిన రేపల్లె ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షులు కళాతపస్వి శ్రీ పోలూరు సుబ్బారావు, తెలుగు పండితులు దివి శ్రీనివాసమూర్తి, ప్రముఖ సంఘ సేవకులు పిసి సాయిబాబు లను సాహితీ భారతి ఘనంగా సన్మానించింది. ఈ సభలో రావూరి నరసింహా వర్మ, ఆదం షఫీ , మర్రి మాల్యాద్రి రావు, మన్నె శ్రీనివాస రావు ,బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, ఎస్ కృష్ణ , బోలగాని వెంకటేశ్వర్లు, శ్రీహరి రావు, దర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు వెంకు సనాతని వందన సమర్పణ చేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-పర్చూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం 22న మండల పరిషత్ కార్యాలంలో జరుగుతుందని ఎంపిడిఓ లక్ష్మీదేవి మంగళవారం ప్రకటనతో తెలిపారు. ఎంపిపి మేకా ఆనందకుమారి అధ్యక్షతన సమావేశం జరుగుతుందని తెలిపారు.

నగదు, మద్యం తరలింపు అరికట్టాలి

ఇంచార్జి కలెక్టర్ శ్రీనివాసులు
సరిహద్దుల్లో నిఘా పెంపునకు ఆదేశం

విశాలాంధ్ర - బాపట్ల : నగదు, మద్యం అక్రమ తరలింపులు అరికట్టడానికి మండలాల సరిహద్దులలో స్టాటిస్టికల్ సర్వేలెన్స్ బృందాల నిఘా పెంచాలని జిల్లా ఇన్ఛార్జి కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు ఆదేశించారు. శాసన మండలి ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన ఆయా కమిటీల్లోని అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉన్నందున నగదు, మద్యం పంపిణీ జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇతర ప్రాంతాలనుంచి నగదు, మద్యం ఆయా మండలాలలోకి ప్రవేశించకుండా అడ్డుకట్ట వేయాలన్నారు. అక్రమ తరలింపులు అరికట్టడానికి పోలీసులు సూచించిన రహదారుల వద్ద 24 గంటలపాటు నిఘా ఉంచేలా స్టాటిస్టికల్ సర్వేలెన్స్ బృందాలు పనిచేయాల్సి ఉందన్నారు. ఆ బృందాలు గుర్తించిన అంశాలను ఎప్పటికప్పుడు ఎన్నికల కంట్రోల్ రూమ్కు చేరవేయాలన్నారు. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రెండురోజుల్లో ముగుస్తున్నందున అభ్యర్థుల ప్రచారం మొదలయ్యే అవకాశం ఉందన్నారు. వారు వినియోగించే కరపత్రాలు, ఇతర సామాగ్రిని పరిశీలించాలన్నారు. కరపత్రాలు, సమావేశాలకు అనుమతులపై ప్రత్యేక పరిశీలన ఉండాలన్నారు. ఒకే ప్రాంతంలో రెండు రాజకీయ పార్టీల అభ్యర్థులు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు కమిటీల దృష్టికి వస్తే తక్షణమే కంట్రోల్ రూమ్కి సమాచారం ఇవ్వాలన్నారు. ఆ ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకోసం పోలీస్ బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. అనుమతి లేకుండా లౌడ్ స్పీకర్ల వినియోగాన్ని అరికట్టాలన్నారు. ముఖ్యంగా సెక్టోరల్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు సమర్థంగా పనిచేయాలన్నారు. ఎన్నికల విధుల నిర్వహణపై పూర్తిస్థాయిలో శిక్షణలు ఇవ్వాలన్నారు. చీరాల సహాయ రిటర్నింగ్ అధికారి, ఆర్.డి.ఓ. సరోజిని నుంచి బ్యాలెట్ బాక్సులను అధికారులు రెండురోజుల్లో తెచ్చుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారిణి కె.లక్ష్మీశివజ్యోతి, నోడల్ అధికారులు, వివిధ కమిటీలలోని అధికారులు, ఆయా మండలాల నుంచి మండలస్థాయి కమిటీలలోని అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 22 మంది సీఈసీ విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర - వేటపాలెం : బిట్ లాబ్స్ సాఫ్టేర్ కంపెనీ బెంగళూరు ఆధ్వర్యంలో చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో గత రెండు రోజులుగా జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 22 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. కంపెనీ హెచ్.ఆర్. ప్రతినిధులు రాకేష్ బృందం ఆధ్వర్యంలో జరిగిన ఎంపిక పక్రియలో రాత పరీక్ష సాంకేతికత అంశాలపై పరీక్ష నిర్వహించి ఇంటర్వ్యూలు చేసి 22 మందిని ఎంపిక చేశారు. ప్రాంగణ ఎంపికలకు బీటెక్ సంవత్సరం ఈ.సి.ఇ.ఇ.ఇ., సి.ఎస్.ఈ, విద్యార్థులు 70 మంది హాజరయ్యారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాల, కంపెనీ ప్రతినిధులు నియామకపు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన అభి నందన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.రవికుమార్ మాట్లాడుతూ ప్రాంగణ ఎంపికల్లో వరుసగా పెద్ద సంఖ్యలో తమ కళాశాల విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు సాధించటం హర్షణీయమన్నారు. ఎంపికైన విద్యార్థులు మరింతగా కష్టపడి మంచి ఫలితాలు సాధించింది పదోన్నతిని పొందాలని ఆకాంక్షించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగాలను సులువుగా దక్కించుకోవాలంటే సాంకేతిక నైపుణ్యంతో పాటు నాయకత్వ లక్షణాలు భావవ్యక్తీకరణ వంటి అంశాలలో మెరుగైన ప్రతిభ చూపాలన్నారు. మేనేజ్మెంట్ సహకారంతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నామని విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని చెప్పారు. విజయానికి అడ్డదారులు ఉండవని కష్టపడటం ఒకటే మార్గమని స్పష్టం చేశారు. ఎంపికైన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 3.5 లక్షల ప్యాకేజీ వస్తుందని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని యాజమాన్యంతో పాటు ఆచార్యులు, సహాయచార్యులు, విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్లేస్మెంట్ ఆఫీసర్ బాజీ షాహిద్, హెచ్.ఒ.డి. డాక్టర్ షేక్ బషీరా, డాక్టర్ సౌజన్య, పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

శనగ పంట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - జె.పంగులూరు : కష్టపడి పండించిన శనగలను రైతులు అమ్ముకునేందుకు ప్రభుత్వం శనగ కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు డిమాండ్ చేశారు. పంగులూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు 80 వేల ఎకరాలు శనగ పంటను సాగు చేశారని తెలిపారు. రైతులకు గత నాలుగేళ్లుగా మద్దతు ధర లేకపోవడంతో శనగలు మొత్తం కోల్డ్ స్టోరేజ్లో ఉంచారన్నారు. ఈ ఏడాది కూడా మద్దతు ధర లేకపోతే ఈసారి కూడా శనగ పంట మొత్తం కోల్డ్ స్టోరేజ్కి తరలిపోయే అవకాశం ఉందన్నారు. ఈ దశలో రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం వెంటనే శనగ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని లేకపోతే ప్రైవేటు వ్యాపారులు పూర్తిగా ధరలు తగ్గించి రైతులను నిలువునా మోసం చేసే అవకాశం ఉందని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటిం చిన మార్కెట్ ధర క్వింటాకు రూ. 5,335లు ఉందని, బయట మార్కెట్లో రూ. 4,400 లు మాత్రమే ఉందని తెలిపారు. ప్రైవేటు రేటు ప్రకారం రైతులు పంట అమ్ముకుంటే సుమారు రూ. 800 నష్టపోవాల్సి వస్తుందని అన్నారు. రైతుకు ఎకరాకు కౌలుతో కలిపి రూ. 35 వేల పెట్టుబడి అవుతుందని, దిగుబడి ఎకరాకు 7, లేదా 8 క్వింటాళ్లు మాత్రమే వస్తుందని తెలిపారు. ప్రైవేటు వ్యాపారుల నుండి శనగ రైతులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ప్రభుత్వం వెంటనే స్పందించి శనగ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

అన్నా క్యాంటీన్లో 350 మందికి అన్నవితరణ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలను పరిష్కరించుకొని ఆస్ట్రేలియాలో ఉంటున్న కర్పూరపు కౌండిన్య కృష్ణ జన్మదినం సందర్భంగా బాపట్ల అన్నా క్యాంటీన్లో 350 మంది నిరుపేదలకు అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు కర్పూరపు కృష్ణ తండ్రి కర్పూరపు వేణుగోపాలరావును తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ వేగేశన నరేంద్రవర్మ రాజు ఆదేశంతో ఘనంగా సత్కరించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తానికొండ దయాబాబు మాట్లాడుతూ అన్నా క్యాంటీన్ ద్వారా వేలాది మంది నిరుపేదలకు అన్న వితరణ కార్యక్రమం జరగడం హర్షించదగిన విషయమని అన్నారు. అలాగే ఆస్ట్రేలియాలో ఉన్న బాపట్ల ప్రాంతం పై ఉన్న మొక్కువతో కర్పూరపు కౌండిన్య కృష్ణ జన్మదిన వేడుకలను జరుపుకోవడం భవిష్యత్ తరాలకు శుభ పరిణామమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చిన్న బాబు, మందపాటి ఆంద్రేయ, విన్నకోట ఆనంద నాయుడు , గొల్లపల్లి శ్రీనివాసరావు, సుబ్బారావు, రమేష్ గౌడ్, మస్తాన్వలి తదితరులు పాల్గొన్నారు.

వేగేశన హౌస్ అరెస్టు దుర్మార్గం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : గన్నవరంలో జరిగిన రెండు పార్టీల సంఘటనతో బాపట్లలో టీడీపీ నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. మంగళవారం తెల్లవారుజామున నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వేగేశన నరేంద్రవర్మరాజు ఇంటిని చుట్టుముట్టి హౌస్ అరెస్టు చేయడంపై పార్టీ శ్రేణులు విమర్శలను గుప్పించారు. హౌస్ అరెస్ట్ విధానంపై తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి వేగేసిన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల డబ్బుతో జీతాలు ఇస్తూ పోలీసులను సొంత తొత్తులుగా వాడుకోవడం దుర్మార్గపు చర్యని అన్నారు. ప్రతిపక్ష పార్టీ కార్యాలయాలను ధ్వంసం చేస్తుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర వహించి వైసిపి గూండాలకు అండగా నిలబడటం సిగ్గుచేటని ఎద్దేవ చేశారు. నిష్పక్షపాతంగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై వైసిపి రౌడీలు దాడులు చేస్తుంటే తిరిగి మాపై కేసులు పెట్టడం, హౌస్ అరెస్ట్ చేయడం చరిత్ర హీనతకు నిదర్శనమని రాష్ట్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. అదేవిధంగా ప్రజా పక్షాన ప్రతిపక్ష పార్టీ హోదాలో ఉంటూ ప్రజా సమస్యలపై తెలుగుదేశం పార్టీ నిరంతరం నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు.

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : పట్టణంలోని 8వ వార్డు, ఉప్పరపాలెంకు చెందిన షేక్ సైదాభి షార్ట్ సర్క్యూట్ వలన అగ్నిప్రమాదం జరిగింది. ఈ నేపధ్యంలో టీడీపీ ఇంచార్జీ వేగేశన నరేంద్రవర్మ సంఘటన స్థలాన్ని సందర్శించి బాధితులను పరామర్శించి వేగేశన ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. అధైర్య పడోద్దని పౌండేషన్ సాయం అండగా ఉంటుందని తెలిపారు.

సామాజిక న్యాయం జగన్మోహన్రెడ్డికే సాధ్యం

విశాలాంధ్ర - చీరాల : రాష్ట్రంలో సామాజిక న్యాయం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే సాధ్యమని ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. మంగళవారం నూతనంగా మూడవసారి ఎమ్మెల్సీగా ఎన్నికైన పోతుల సునీత తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ పదవులు ఇచ్చిన ఖచ్చితంగా సామాజిక న్యాయం చేకూరేవిధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాటిస్తారని అన్నారు.బీసీల పార్టీ అని చెప్పుకునే వాళ్ళు బీసీలను బ్యాక్వర్డ్ క్లాసులుగానే చూసేవారని,ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాత్రం బీసీలను బ్యాక్బోన్లుగా చూస్తున్నారని అన్నారు.ఏ పథకలైన ఎస్సి,ఎస్టీ,బీసీలను దృష్టిలో పెట్టుకుని అమలు చేస్తున్నారని,ప్రభుత్వ పాఠశాలలకు, ప్రభుత్వ వైద్యశాలలకు మహర్దశ పట్టించిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని అన్నారు.తదనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆమె అభిమానులు ఆమెను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుని వైద్యం కోసం వితరణ

విశాలాంధ్ర-అద్దంకి ; పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో డ్రాయింగ్ టీచర్గా పనిచేస్తూ మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న తిరుమలశెట్టి వెంకటేశ్వర్లుకు వైద్య ఖర్చుల కోసం స్థానిక పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ ఛారిటబుల్ ట్రస్టు తరపున ట్రస్టు అధ్యక్షులు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి మంగళవారం రూ 10వేలు ఆర్థిక సాయం అందజేశారు.

యువతను అభివృద్ధి వైపు నడపండి

విశాలాంధ్ర - చీరాల : రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాలు పరిపాలనను పక్కనపెట్టి ఒక పార్టీ మీద మరొక పార్టీ ప్రతిఘటన చర్యలతో నిత్యం ప్రజలను ఆందోళనకు గురిచేస్తూ,రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గంలో కాకుండా భావితరాల భవిష్యత్తుని నాశనం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని బిఎస్పీ చీరాల నియోజకవర్గ అధ్యక్షులు గొర్రెపాటి రవికుమార్ అన్నారు. సోమవారం గన్నవరంలో జరిగిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ ప్రకటనను విడుదల చేశారు. ప్రకటనలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు అయ్యుండి ప్రజలకు ఎం కావాలో,వారి భవిష్యత్తును ఏ విధంగా నిర్మించాలి అనే అంశాలపై నేటి వరకు ఎటువంటి చర్చ అధికార ప్రతిపక్షాలు చేపట్టలేదని,ప్రజా ప్రతినిధులు అయ్యుండి సవాళ్లు,ప్రతి సవాళ్లు విసురుకుంటూ రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేసే విధంగా పరిస్థితులు కల్పిస్తున్నారని అన్నారు.గన్నవరం టిడిపి కార్యాలయంపై దాడి, అక్కడ జరిగిన ఘటనను మీడియా లో చూస్తుంటే ఈ రాష్ట్రాన్ని,యువతను గుండాయిజం,ఫ్యాక్షనిజం వైపు ప్రోత్సహిస్తున్నారనిపిస్తుందని అన్నారు.రాష్ట్రంలో ఉన్న బహుజనులు,మేధావులు,నేటి యువత ఈ దుశ్చర్యలకు పాల్పడకుండా ఉండాలంటే విజ్ఞానవంతులైన ప్రజాప్రతినిధులు చట్టానికి లోబడి పాలనను కొనసాగించే వారు చట్టసభలలో ఉండాలని అన్నారు.రాష్ట్రంలో ఏదో ఒకచోట మారణ హోమం సృష్టిస్తున్న ఈ రాజకీయ గుండాలను పోలీస్ యంత్రాంగం స్వయం ప్రతిపత్తిన తమకున్న విశేష అధికారములను వినియోగించి అణచివేయాలని కోరారు.

ఘనంగా మాతృభాష దినోత్సవం

విశాలాంధ్ర - చీరాల : మనస్సులోని భావాలను సహజంగా వ్యక్తం చేయగల శక్తి మాతృభాషలోనే ఉందని అందుకే మహనీయులందరు మాతృభాషను నేర్చుకున్నారని,ఇతర భాషలను నేర్చుకోవడం అవసరమే కానీ మాతృభాషను చిన్న చూపు చూడరాదని ప్రధానోపాధ్యాయులు బి సాల్మన్ అన్నారు.అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆంధ్ర రత్న పురపాలకోన్నత పాఠశాలలో మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాల్మన్ రాజు మాట్లాడుతూ మనిషి తన భావాలను వ్యక్తపరిచే ఒక సాధనం భాషని భూమిపై ఉన్న అన్ని జీవరాశుల్లో మానవుడు ఒక్కడే తన భావాలను మాటల రూపంలో వ్యక్తం చేయగలుగుతాడని అన్నారు. మనిషి తన మనసులోని అభిప్రాయాలు,భావాలను బహిర్గతం చేయడానికి ముఖావయంతో చేసే అర్థవంతమైన ధ్వనుల సముదాయమే భాష అని మనిషి పుట్టగానే తల్లి ఒడిలో నేర్చుకునే పదాలే మాతృభాష అన్నారు.మనిషికి ఎంతో విలువైనవి అమ్మ పలుకులలోని ఆప్యాయత అనురాగం మరెక్కడా దొరకవని,మనిషి తాను ప్రపంచంలో అన్ని చోట్ల జయించాలంటే తన మాతృభాషను గౌరవించాలని అన్నారు.తదనంతరం తెలుగుని సుసంపన్నం చేసిన గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పావళ్ళ శివవరప్రసాద్,టి చంద్ర శేఖర్,రాజేంద్రప్రసాద్, వెలుగొండా రెడ్డి,పవని భానుచంద్ర మూర్తి,సీహెచ్ మాధవి , సుకుమారి,ప్రసన్న కుమారి,మంత్రి కృష్ణ మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
బాపట్ల జిల్లా

ఘనంగా మాతృభాషా దినోత్సవం

విశాలాంధ్ర - రేపల్లె : ప్రపంచ భాషల్లో తెగులు భాష ఎంతో కీర్తిని సంపాదించిందని విశ్రాంత తెలుగు అధ్యాపకులు, ప్రముఖ వక్త మొవ్వ ఉషాద్రిపతి అన్నారు. ప్రపంచ మాతృ భాష దినోత్సవ సందర్భంగా శ్రీ ఏ.బి.ఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాతృ భాష పట్ల నేటి యువత మక్కువ కలిగి ఉండాలన్నారు. ఆధునిక యుగంలో ఏభాషను నేర్చుకోవలన్న మాతృభాష మార్గం అన్నారు. తెలుగు భాషకు ఎంతో ఘన చరిత్ర ఉందన్నారు. ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్గా తెలుగు భాష ప్రావీణ్యం పొందిందన్నారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న మాతృభాషను మరచి పరాయి భాషపై ఆశక్తి పెంచుకోవడం అవివేకం అన్నారు. మాతృభాషను చదువుకోవడం వలన జ్ఞానం మెరుగు పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రవిచంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - బల్లికురవ : ఆడపిల్లలు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా కొన్ని సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చని మండల వైద్యాధికారి డాక్టర్ రమీజ్ అహ్మద్ సూచించారు.మంగళవారం గుంటుపల్లి గురుకుల పాఠశాలలోని 217 మంది విద్యార్థులకు ఒంటిపై వచ్చే మచ్చలకు,కంటి చూపు,క్షయ తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ ఆడపిల్లలు చిన్న వయసు నుండి పౌష్టిక ఆహార తీసుకోవాలని తద్వారా యుక్త వయసులో ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తమన్నారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శ్రీనివాసరావు,. ఏఎన్ఎంలు రాజ్యలక్ష్మి,అనూష,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయండి



విశాలాంధ్ర - మార్టూరు : ఇల్లు కట్టుకునే స్తోమత లేని పేదలకు ప్రభుత్వమే ఇల్లు కట్టిచ్చి ఇస్తుందని త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని ఆర్డీవో జి.రవీందర్ తెలిపారు. మంగళవారం మార్టూరు జగనన్న లేఅవుట్లను ఆయన పరిశీలించారు. ఇల్లు కట్టుకునే స్తోమత లేని పేదలకు ప్రభుత్వ లోన్ సౌకర్యం కల్పిస్తుందని గృహ నిర్మాణ శాఖ వారి బిల్లు పడగానే లోన్ తిరిగి చెల్లించవచ్చని పేర్కొన్నారు. అయినప్పటికీ కట్టుకోలేని స్తోమత లేనివారు పట్టాలు వద్దని మేము కట్టుకోలేమని రాతపూర్వకంగా ఆర్డీఓకి పట్టా సమర్పించవచ్చని అన్నారు. ఈయన వెంట ఎంపీడీవో నితిన్, తహసిల్దార్ బి.వెంకటరెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ ప్రహర్ష,రెవిన్యూ ఇన్స్పెక్టర్ షేక్ షఫీ భాష పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పొలాల పరిశీలన

విశాలాంధ్ర - భట్టిప్రోలు : పంటసాగు చేసి 40 రోజులు దాటిన పైరు ఎదుగుదలలేని కారణంగా దిగుబడులు ఏలా వస్తాయంటూ వ్యవసాయ శాఖ అధికారులు వద్ద రైతులు ఆందోళన వ్యక్తం చేయగా స్పందించిన అధికారులు సదరు పైరును మంగళవారం పరిశీలించారు. మండల కేంద్రమైన భట్టిప్రోలులో రబీ సీజన్ను పురస్కరించుకుని ఈ ఏడాది జనవరి నెలలో వరి మాగాణి భూములలో మొక్కజొన్న పంటను సాగు చేశారు. విత్తనం నాటి 40 రోజులకుపైగా గడచిన పైరు ఎదుగుదల లేదని రైతులు తెలిపిన సమాచారం మేరకు వ్యవసాయ శాఖ అధికారులు సదరు పంట పొలాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రేపల్లె వ్యవసాయ శాఖ ఎడిఎ అక్తర్ హుస్సేన్ మాట్లాడుతూ కొన్ని పంట పొలాల్లో మొక్కజొన్న పెరుగుదల చాల తక్కువగా ఉన్నట్లు గమనించామన్నారు. పంట పొలాలు చౌడుగా మారడమే దీనికి కారణమన్నారు. ఎకరాకు అర లీటర యూరియా ద్రావణం, అర లీటరు వేపనూనె కలిపి పిచికారీ చేయాలన్నారు. రైతులు గమనించి వ్యవసాయశాఖ అధికారుల సూచనల ప్రకారం ఎరువులను తగిన మోతాదులో వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఓఎ ఎస్. రజని, రైతులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ బియ్యం కలకలంపై స్పందించిన అధికారులు

విశాలాంధ్ర ఎఫెక్ట్

విశాలాంధ్ర - భట్టిప్రోలు : చౌక దుకాణాల ద్వారా కార్డు దారులకు పంపిణీ జరిగిన బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం కల్తీ జరిగినట్లు కార్డుదారులో వచ్చిన కలకలంపై ఈ నెల 19న విశాలాంధ్ర దినపత్రిక మెయిన్ ఎడిషన్లో "రేషన్లో ప్లాస్టిక్ బియ్యం" అన్న శీర్షికన ప్రచురితమైన వార్తకు స్పందించిన సివిల్ సప్లయ్ అధికారులు బియ్యం పంపిణీ జరిగిన ప్రాంతాలలో పర్యటించి పరిశీలించి ప్లాస్టిక్ బియ్యం పంపిణీ జరిగిందా లేదా అనే అంశాలపై కార్డుదారుల నుంచి వివరాలు సేకరించారు. రేషన్ బియ్యంలో పోషక విలువలు కలిగిన నాన్ సార్టెక్స్ పోర్టిఫైడ్ బియ్యం కలిసి పంపిణీ కాబడిందని ఆ బియ్యం నీటిలో తేలుతాయని సాగే గుణం ఉండదని ఆ బియ్యం తినడం వలన ఏవైనా ఇబ్బందులు వచ్చాయా అని ఆరా తీశారు. రేషన్ పంపిణీలో కల్తీ లేదని అవి ప్లాస్టిక్ బియ్యం కాదని ఎటువంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదని కార్డుదారులకు అవగామన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ డిటి రవీంద్ర, ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్ఛార్జీ వెంకటేష్, ఆర్ఐ. శివరామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సముచిత స్థానంపై హర్షం..

- హామీల విస్మరణపై నిరసన
- రాయితీ రుణాల ఊసేది
-కార్పొరేషన్ కార్యాలయాలెక్కడ
- మీడియాతో రవికుమార్



విశాలాంధ్ర - బాపట్ల : ఆర్థిక, విద్యా అభ్యున్నతిలో వెనుకబడిన బీసీ కులాల రాజకీయ సామాన్యతకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తానన్న హామీలు నెరవేర్చాలని బీసీ సంక్షేమ సంఘం బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్ పేర్కొన్నారు. 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 11 ఎమ్మెల్సీ సీట్లు బీసీలకు కేటాయించడంపై హర్ష వ్యక్తం చేస్తూ, కొన్ని కులాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంపై నిరసన వ్యక్తం చేస్తూ మంగళవారం నరాలశెట్టివారిపాలెంలోన్యాయవాది అంగలకుదురు టి. నటరాజన్ కార్యాలయంలో బీసీ నేతల విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ సీటులో అగ్రస్తానం బీసీలకు కేటాయించడం శుభ పరిణామన్నారు. అయితే జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో రజక, శాలివాహన, నాయి బ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణులకు ఎమ్మెల్సీ సీటు కేటాయిస్తానని ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడం బాధాకరమన్నారు. బీసీల్లో ఉన్న 142 కులాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వ కృషి చేస్తానన్న హామీ నెరవేర్చేదిశగా ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. గత ప్రభుత్వం సరైన ప్రణాళిక లేకపోవడం వలనే వైసీపీకి 2019 ఎన్నికలలో బీసీలు వెంట నిలిచారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం బీసీల అభ్యున్నతి కోసం కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, కార్పొరేషన్ చైర్మన్ క్యాబినెట్ హోదా కల్పిస్తున్నామని ప్రకటించటం స్వాగతించామన్నారు. అయితే ఏ కార్పొరేషన్ విధి నిర్వహణకు కావలసిన కార్యాలయాలు సైతం ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. గడిచిన మూడున్నర సంవత్సరం పాలనలో కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు ఆయా కులాల అభ్యున్నతికి చేసిన కృషి శూన్యం అన్నారు. అందరి సంక్షేమం దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ఆయా కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు ప్రచారం చేయాలని ఆలోచన పునఃపరిశీలించుకోవాలన్నారు. ఆయా కులాల యువతను ప్రోత్సహించే దిశగా అడుగులు వేయడంలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం యువత అభివృద్ధికి రాయితీ రుణాలను కల్పించాలన్నారు. కార్పొరేషన్లు నుంచి చిన్న పరిశ్రమ, కుటీర పరిశ్రమలకు రాయితీ రుణాలు మంజూరు చేసే విధంగా నిధులు కేటాయింపు చేయాలన్నారు. ఇప్పటి వరకు వారికి జీతభత్యాలను కల్పించకపోవడం బాధాకరమన్నారు. వారి విధి నిర్వాహణకు కార్యాలయం ఏర్పాటు, జీతభత్యాలు కల్పించాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి బీసీల సమస్యలను పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు మద్దిబోయిన తాతయ్య, జిల్లా న్యాయ సలహాదారుడు అంగలకుదురు టి. నటరాజన్, జిల్లా కార్యదర్శి మారం రవికుమార్, బాపట్ల నియోజక వర్గం అధ్యక్షులు పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, యువజన విభాగం నియోజవర్గ అధ్యక్షుడు ఎన్ఎస్పి రాజు, మద్దసాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.